తెలుగు దినపత్రిక https://aksharagalam.com

# అక్షరగళం

ప్రతి అక్షరం ప్రజల కోసం

Published From: Medchal-Malkajgiri | సంపుటి: 5 సంచిక: 94 పేజీలు : 08 | శనివారం 28-3- 2026 వెల: 3 రూ/.

## లఢఖ్‌లో భారీగా మంచు తుపాను

### - ఆరుగురి మృతి, ఐదుగురికి తీవ్ర గాయాలు



**లేహ్** లఢఖ్‌లోని జోజిలా పాస్ సమీపంలో శుక్రవారం ఘోర ప్రమాదం జరిగింది. శ్రీనగర్-లేహ్ జాతీయ రహదారిపై భారీగా మంచు చరియలు విరిగిపడటంతో పలు వాహనాలు వాటి కింద చిక్కుకుపోయాయి. ఈ దుర్ఘటనలో ఆరుగురు ప్రాణాలు కోల్పోగా, మరో ఐదుగురు తీవ్రంగా గాయపడ్డారు. ప్రమాదం జరిగిన వెంటనే సహాయక చర్యలు చేపట్టిన అధికారులు, తొలుత ఎలాంటి ప్రాణనష్టం జరగలేదని భావించారు. అయితే, గాలింపు చర్యలు కొనసాగిస్తుండగా,

2లో..

## కమనీయం..సీతారామ కళ్యాణం

- మిథిలా మండపంలో కన్నుల పడువగా కళ్యాణోత్సవం
- పట్టు వస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించిన సీఎం దంపతులు
- రామనామంతో మార్మోగిన భద్రాద్రి..భారీగా హాజరైన ప్రజలు
- పలువురు మంత్రులు, ప్రముఖుల రాక





**భద్రాచలం:** శ్రీరామ నవమి సందర్భంగా భద్రాచలంలో శ్రీసీతారాముల కల్యాణోత్సవం కన్నులపండువగా కొనసాగింది. వేదపండితుల మంత్రోచ్ఛారణలతో రఘురాముడి కళ్యాణం రమణీయంగా సాగింది. రాములవారిని, సీతమ్మను మిథిలా మండపంలో వేంచేసి కళ్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించారు. సీతారాముల కళ్యాణాన్ని తిలకించేందుకు తెలుగు రాష్ట్రాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చారు. దీంతో భద్రాచలం వీధులు రామనామ స్మరణతో మార్మోగాయి. తెలంగాణ ప్రభుత్వం తరఫున స్వామి వారికి సీఎం రేవంత్‌రెడ్డి, గీత దంపతులు పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించారు. ఈ కల్యాణోత్సవంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, కొండా సురేఖ, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు భద్రాచలం ఆలయ అభివృద్ధి పనులకు సీఎం రేవంత్ భూమిపూజ చేశారు. తొలి విడతలో రూ.351 కోట్లతో చేపట్టే పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. శ్రీరామనవమి సందర్భంగా భద్రాచలంలో శ్రీసీతారాముల కల్యాణోత్సవంఅంగరంగ వైభవంగా జరిగింది. మిథిలా స్టేడియంలోని మండపంలో వేద మంత్రోచ్ఛరణల నడుమ సీతారాముల కల్యాణ మహోత్సవాన్ని నిర్వహించారు. ముందుగా శ్రీసీతారాములను పల్లకిలో ఊరేగింపుగా మండపానికి తీసుకొచ్చారు. శుక్రవారం ఉదయం 10:30 గంటలకు స్వామివారి కల్యాణ ఘట్టం మొదలైంది. అభిజిత్ లగ్నంలో సీతారామయ్యల శిరస్సుపై ఆలయ అర్చకులు జీలకర్ర, బెల్లం పెట్టారు. ఆపై సీతమ్మ మెడలో రామయ్య మాంగళ్యధారణ చేశారు. అనంతరం తలంబ్రాల వేడుక నిర్వహించారు. ఆలయ అర్చకులు ఇతర కార్యక్రమాలను సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. భద్రాద్రిలో జరుగుతున్న సీతారామయ్య కల్యాణాన్ని వీక్షించేందుకు తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా వివిధ రాష్ట్రాల నుంచి శ్రీరాముని భక్తులు భారీగా తరలివచ్చారు. శ్రీరామ నామస్మరణతో మిథిలా స్టేడియం ప్రాంగణం మార్మోగింది. సీతారాముల కల్యాణం సందర్భంగా మిథిలా స్టేడియంతో పాటు రామయ్య దేవాలయాన్ని సర్వాంగ సుందరంగా ముస్తాబు చేశారు. భక్తులు భారీగా తరలిరావడంతో.. వారికి ఎటువంటి ఇబ్బంది కలగకుండా దేవస్థానం అధికారులు, సిబ్బంది అన్ని ఏర్పాట్లు చేశారు. లక్షల మంది భక్తులు ఆలయానికి చేరుకుని పెళ్లి వేడుకను కనులవిందుగా తిలకించారు. తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి పొంగలేటి సహా పలువురు ప్రముఖులు వేడుకలో పాల్గొన్నారు. శు క్రవారం ఉదయం బేగంపేట

2లో..

## యుద్ధం వేళ సీఎంలతో ప్రధాని భేటీ

### - రాష్ట్రాల సన్నద్ధత, ప్రణాళికలపై కీలక చర్చలు




**న్యూఢిల్లీ** పశ్చిమాసియాలో యుద్ధంతో నెలకున్న ఉద్రిక్తతలు, దేశంపై దాని ప్రభావం, పరిణామాలపై చర్చించేందుకు అన్ని రాష్ట్రాల సీఎంలతో ప్రధాని నరేంద్ర మోదీ శుక్రవారం వర్చువల్‌గా సమావేశమయ్యారు. సాయంత్రం 6.30 గంటలకు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రధాని వారితో మాట్లాడారు. ఈ సమావేశానికి అసెంబ్లీ ఎన్నికలు జరుగుతున్న పశ్చిమ్ బెంగాల్, తమిళనాడు, కేరళ సహా ఐదు రాష్ట్రాల ముఖ్యమంత్రులు మాత్రం దూరంగా ఉన్నారు. ఏపీ, తెలంగాణ ముఖ్యమంత్రులు నారా చంద్రబాబు నాయుడు, ఏ రేవంత్ రెడ్డి సహా మిగతా రాష్ట్రాల సీఎంలు ఇందులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్రాల సన్నద్ధత, ప్రణాళికలపై ప్రధాని చర్చలు జరిపారు. టీమిండియా స్ఫూర్తితో రాష్ట్రాలను సమన్వయం చేసుకునేలా జరిగిన ఈ భేటీకి హోం శాఖ మంత్రి అమిత్ షా, రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్

2లో..

## ప్రపంచ టెలికాం వ్యవస్థలకు పెనుముప్పు

### - చైనా హ్యాకర్ల కొత్త ఎత్తుగడ



**న్యూఢిల్లీ** ప్రపంచవ్యాప్తంగా టెలికాం మౌలిక సదుపాయాలే లక్ష్యంగా చైనాకు చెందిన ఓ హ్యాకింగ్ గ్రూప్ అత్యంత ప్రమాదకరమైన సైబర్ దాడులకు పాల్పడుతోందని ఓ నివేదిక సంచలన విషయాలు వెల్లడించింది. ఈ హ్యాకర్లు దీర్ఘకాలిక సైబర్ గూఢచర్యం కోసం టెలికాం నెట్‌వర్క్‌లలోకి రహస్యంగా మాల్‌వేర్‌ను చొప్పిస్తున్నారని సైబర్ సెక్యూరిటీ సంస్థ రాపిడ్7

2లో..

## ఆటల బరిలోకి తెలంగాణ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు

### - హైదరాబాద్ ఎల్బీ స్టేడియం వేదికగా స్పోర్ట్స్ మీట్




**హైదరాబాద్** రాజకీయ నాయకులు అంటే నిత్యం ప్రజల్లో తిరుగుతూ ప్రజా సమస్యలపై పోరాటం చేస్తారు. ప్రతిపక్షాలపై అధికార పక్షం అధికార పక్షంపై ప్రతిపక్షాలు తీవ్ర విమర్శలు గుప్పించుకుంటారు. ప్రారంభోత్సవాలు, సంక్షేమ పథకాల అమలు, శంకుస్థాపనలు, రాజకీయ సభలు, సమావేశాలతో బిజీ బిజీగా గడుపుతూ ఉంటారు. తమ ఇంటికి వచ్చిన నియోజకవర్గ ప్రజలను కలుస్తూ వారి సమస్యలను తెలుసుకుని తీర్చుతూ ఉంటారు. ఉదయం లేచిన దగ్గరి నుంచి రాత్రి పడుకునే వరకు ఫుల్ బిజీగా ఉంటారు. అయితే అలా బిజీ బిజీ లైఫ్ గడిపే ప్రజా ప్రతనిధులకు ఆటల పోటీలు నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఈ నెల 28, 29వ తేదీల్లో ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు ఆటల పోటీలు నిర్వహించనున్నట్లు తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ గురువారం శాసనసభలో ప్రకటించారు. హైదరాబాద్‌లోని ఎల్బీ స్టేడియం వేదికగా తొలి విడత లెజిస్లేటర్ స్పోర్ట్స్ మీట్--2026 నిర్వహించనున్నట్లు తెలిపారు. దీని కోసం

2లో..

## హర్మూజ్‌లో తీవ్ర ఉద్రిక్తత

### - చమురు ట్యాంకర్‌ను ధ్వంసం చేసిన ఇరాన్



**హర్మూజ్** ఇరాన్, అమెరికా-ఇజ్రాయెల్ యుద్ధంతో అట్టుడుకుతున్న పర్షియన్ గల్ఫ్‌లో మరోసారి ఉద్రిక్తత తారస్థాయికి చేరింది. హర్మూజ్ జలసంధిలో తమ నిబంధనలు ఉల్లంఘించి ప్రవేశించిన ఓ ఆయిల్ ట్యాంకర్‌పై ఇరాన్ రివల్యూషనరీ గార్డ్స్ కార్ప్స్ (ఐఆర్జీసీ) క్షిపణులతో దాడి చేసి ధ్వంసం చేసింది. ఈ ఘటన శు క్రవారం చోటుచేసుకుంది. దాడికి గురైన ట్యాంకర్ పాకిస్థాన్ జెండాతో ఉన్నట్లు పలు కథనాలు సూచిస్తున్నాయి. ఇరాన్ హెచ్చరికలను పెడచెవిన పెట్టి జలసంధిని దాటేందుకు ప్రయత్నించడంతోనే ఈ దాడి చేసినట్లు ఇరాన్ వర్గాలు తెలిపాయి. మరోవైపు, పాకిస్థాన్

2లో..

## ఇక తెలంగాణ ఆడబిడ్డ పార్టీ

- 25న పార్టీ పేరును,జెండాను, ఎజెండాను ప్రకటిస్తా
- మేడ్చెల్ మునీరాబద్ వేదికగా పార్టీని వెల్లడిస్తా
- శ్రీరామనవమి రోజు కాబట్టి ప్రకటన చేస్తున్నా
- తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత ప్రకటన



**నిజామాబాద్:** తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత కీలక ప్రకటన చేశారు. ఏప్రిల్ 25న ఉదయం 10గంటలకు నూతన రాజకీయ పార్టీ స్థాపించబోతున్నట్లు వెల్లడించారు. మేడ్చల్ జిల్లా మునీరాబాద్‌లోని అధ్వయ కన్వెన్షన్‌లో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి పార్టీ ప్రకటన చేయబోతున్నట్లు చెప్పారు.

2లో..

## మేము క్రీడలు ఆడి ఒలింపిక్స్‌కి వెళ్లేది ఏమీ లేదు

### - స్పోర్ట్స్ మీట్‌లో పాల్గొనడం లేదని కేటీఆర్ స్పష్టం



**హైదరాబాద్** నిత్యం రాజకీయాలు, ప్రజా సమస్యలతో బిజీగా ఉండే తెలంగాణ ప్రజాప్రతినిధులకు బిగ్ రిలీఫ్ ప్రకటించారు స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్. ప్రజాప్రతినిధులకు ఆటలపోటీలు నిర్వహించాలని నిర్ణయించారు. రాష్ట్ర చరిత్రలో తొలిసారిగా ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల కోసం 'లెజిస్లేటర్ స్పోర్ట్స్ మీట్--2026' నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ నెల 28, 29 తేదీల్లో

2లో..

## టీవీ రేటింగ్స్‌పై కేంద్రం కొత్త పాలసీ

### - పారదర్శకత, జవాబుదారీతనం పెంచడమే లక్ష్యం




**న్యూఢిల్లీ** దేశంలో టెలివిజన్ ఆడియన్స్ మెజర్‌మెంట్ వ్యవస్థలో పారదర్శకత, స్వాతంత్ర్యం, జవాబుదారీతనాన్ని పెంపొందించే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం 'టీవీ రేటింగ్స్ పాలసీ 2026'ను శుక్రవారం ఆవిష్కరించింది. 2014 నాటి మార్గదర్శకాల స్థానంలో ఈ కొత్త విధానాన్ని ప్రవేశపెట్టింది. ఈ రంగంలోకి కొత్త సంస్థలు ప్రవేశించడాన్ని సులభతరం చేస్తూ, సరసమైన పద్ధతులు, కచ్చితమైన డేటా సేకరణ, బలమైన పర్యవేక్షణ ఉండేలా ఈ పాలసీని రూపొందించారు. సరికొత్త నిబంధనల ప్రకారం, టీవీ రేటింగ్ ఏజెన్సీగా కార్యకలాపాలు ప్రారంభించాలనుకునే కంపెనీలకు ప్రవేశ నిబంధనలను ప్రభుత్వం గణనీయంగా సడలించింది. గతంలో ఉన్న రూ.20 కోట్ల నికర విలువ (నెట్‌వర్త్) ఆవశ్యకతను రూ.5 కోట్లకు తగ్గించింది. ఈ రంగంలో మరింత పోటీని ప్రోత్సహించి, కొన్ని సంస్థల గుత్తాధిపత్యాన్ని నివారించడమే ఈ చర్య

2లో..

## అమెరికా, ఇజ్రాయెల్ దాడుల్లో ఇరాన్‌లో 1,900 మంది మృతి

### - వెల్లడించిన ఇరాన్ ఆరోగ్య మంత్రిత్వ శాఖ



**టెహ్రాన్** అమెరికా-ఇజ్రాయెల్ దాడులు ప్రారంభమైనప్పటి నుంచి ఇరాన్‌లో 1,900 మందికి పైగా మరణించారని ఇరాన్ ఆరోగ్య మంత్రిత్వ శాఖ తెలిపింది. గత నెల ఫిబ్రవరి 28న యుద్ధం ప్రారంభమైన విషయం తెలిసిందే. ఇప్పటివరకు అమెరికా, ఇజ్రాయెల్ దాడుల్లో సుమారు 20,000 మంది గాయపడ్డారని తెలుస్తోంది.

ఇరాన్ చేసిన ప్రతీకార దాడుల్లో ఇజ్రాయెల్‌లో 18 మంది, గల్ఫ్‌లో 20 మంది మృతి చెందారు. 13 మంది అమెరికన్ సైనికులు కూడా మృతి చెందారు. లెబనాన్‌పై ఇజ్రాయెల్ జరిపిన దాడుల్లో 1,100 మందికి పైగా మరణించారని అక్కడి అధికారులు తెలిపారు. ఇరాక్‌లో మరో 80 మంది ప్రాణాలు కోల్పోయారు. ఇదిలా ఉండగా, ఇజ్రాయెల్ సహా గల్ఫ్ దేశాల్లోని అమెరికా స్థావరాలను లక్ష్యంగా చేసుకుని దీర్ఘ, మధ్యశ్రేణి క్షిపణులను ప్రయోగించినట్లు ఐఆర్జీసీ తెలిపింది. ఈ దాడుల్లో బహ్రెయిన్‌లోని అమెరికా పేట్రియాట్ వైమానిక రక్షణ వ్యవస్థ నిర్వహణ కేంద్రం ధ్వంసమైనట్లు తెలిపింది.

తెలుగు దినపత్రిక https://aksharagalam.com
అక్షరగళం
ప్రతి అక్షరం ప్రజల కోసం



### అంగరంగ వైభవంగా

# సీతారాముల కల్యాణ మహోత్సవం

**- ముఖ్య అతిథిగా పాల్గొన్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్**



**రాజన్న సిరిసిల్ల** చందుర్తి మండలం జోగాపూర్ గ్రామంలో శ్రీ సీతారామ చంద్ర స్వామి వారి కల్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. గ్రామ ఉత్సవ కమిటీ మరియు గ్రామ ప్రజల సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుక ఆధ్యాత్మిక శోభతో విరాజిల్లింది. ఈ వేడుకకు వేములవాడ శాసనసభ్యులు, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరై స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి ఆశీస్సులు అందుకున్నారు.?ఈ కల్యాణ మహోత్సవానికి జోగాపూర్ గ్రామ ప్రజలతో పాటు పరిసర ప్రాంతాలైన ఎనగల్, రామరావుపల్లి, కిష్టంపేట గ్రామాల నుండి భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. సీతారాముల కల్యాణాన్ని కనులారా వీక్షించి పునీతులయ్యారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్, ఉప సర్పంచ్, వార్డు సభ్యులు, గ్రామ యువత మరియు భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని ఉత్సవాన్ని విజయవంతం చేశారు. భక్తుల రాకతో జోగాపూర్ గ్రామం భక్తి పారవశ్యంమైంది.

### బాధిత మహిళనైన నాకు న్యాయం

# చేయకుండా నిందితుడికి సహకరిస్తున్నారు

**- నార్సింగి పోలీసులపై మహిళ ఆరోపణ**

**హైదరాబాద్** నన్ను శారీరకంగా,మానసికంగా వేధించిన వ్యక్తి పై పిర్యాదు చేసినా కూడా నార్సింగీ సీఐ హరి కృష్ణా రెడ్డి నిర్లక్ష్యంగా వ్యవహారిస్తూ తిరిగి నన్నే బెదిరిస్తున్నారు అంటూ స్వాతి అనే మహిళ ఆరోపించింది. నిందుతుని తో పోలీస్ లు చేతులు కలిపి నాకు అన్యాయం చేస్తున్నారు అని ఆవేదన వ్యక్తం చేసింది. తన దగ్గర నిందితుడు బొబ్బిలి సాయి కిరణ్ కు వ్యతిరేకంగా అన్ని ఆధారాలు ఉన్నాయని నిందితుడు తన వద్ద నుండి 30 లక్షల రూపాయలను సైతం తీసుకొని వేధిస్తున్నాడంటూ ఆరోపించింది. నిందితుడి తండ్రి బొబ్బిలి ముత్యాల నాయుడు ఆంధ్రప్రదేశ్ అధికార పార్టీ కార్యకర్తగా చలామణి అవుతూ తాను ఆంధ్రప్రదేశ్ కు వెళ్ళినప్పుడు బెదిరించే ప్రయత్నం చేశారని అన్నది. నిందితుడికి సంబంధించి ఫోటోలు వీడియోలు, వీడియో కాల్స్ కూడా తన వద్ద ఉన్నాయంటూ అన్ని ఆధారాలు ఉన్నా కూడా తనకు న్యాయం చేయకుండా పోలీసులు తాచ్చారం చేస్తున్నారని ఆరోపించింది.

# బస్సు దగ్ధం ఘటన బాధితులను పరామర్శించిన మంత్రులు

**ఒంగోలు**మార్కాపురంలో జరిగిన రోడ్డు ప్రమాద బాధితులను ఒంగోలు రిమ్స్ లో మంత్రులు డోల బాల వీరంజనేయులు,గొట్టిపాటి రవి కుమార్ పరమర్శించించారు.గాయపడిన వారికి మెరుగైన వైద్య అందించాలని వైద్య సిబ్బంది కి సూచించారు.బాధితులు కు మెరుగైన వైద్యం అందించి పూర్తిగా కోలుకునే వరకు ప్రభుత్వం అన్ని విధాల సహాయం చేస్తుందని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా మంత్రులు మీడియా మాట్లాడుతూ నిన్న మార్కాపురం లోని రాయవరం వద్ద జరిగిన సంఘటన చాలా దురదృష్టకరం.. కేబినెట్ సమావేశం లో మరణించిన వారికి సంతాపం తెలియజేసమని తెలిపారు. మరణించిన కుటుంబాలను ప్రభుత్వం ఆదుకుంటుందని,అలాగే రాష్ట్ర ప్రభుత్వం తరపున మరణించిన కుటుంబాలకు 5లక్షలు ఎక్స్గ్రేసియా ప్రకటించిందని గాయపడిన వారికి 2లక్షలు ఎక్స్గ్రేసియా ప్రకటించిందని తెలిపారు.కేంద్ర ప్రభుత్వం కూడా మరణించిన వారి కి 2లక్షలు గాయాలపాలైన వారికి 50వేల రూపాయలు ఎక్స్గ్రేసియా ప్రకటించడం జరిగిందని తెలిపారు. బాధిత కుటుంబాలకు అండగా ఉంటానని సీఎం చంద్రబాబు నాయుడు అన్నారు అని తెలిపారు.

### ఆర్బన్ హెల్త్ సెంటర్‌ను ప్రారంభించిన


# ఎమ్మెల్యే అమరనాథరెడ్డి

**పలమనేరు** పలమనేరు పట్టణంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు ఎమ్మెల్యే అమరనాథ రెడ్డి. పేదలకు మెరుగైన ఆరోగ్య సేవలు అందించడమే లక్ష్యమని ఆయన తెలిపారు. సిల్క్ ఫార్మ్ వద్ద బోరు మోటర్, గంటావూరు ప్రాంతంలో ట్రాన్స్ఫార్మర్లు, 91 లక్షలతో నిర్మించిన అర్బన్ హెల్త్ సెంటర్ను ప్రారంభించారు. అలాగే వాటర్ సంపు, పబ్లిక్ టాయిలెట్ల నిర్మాణానికి భూమిపూజ చేశారు. నియోజకవర్గంలో 52 విలేజ్ క్లినిక్స్, అర్బన్ హెల్త్ సెంటర్లు ఏర్పాటు చేస్తున్నామని? 70 రకాల వైద్య పరీక్షలు అందుబాటులో ఉంటాయని చెప్పారు. త్వరలో రోడ్ల నిర్మాణం కూడా చేపడతామని వెల్లడించారు. ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను ప్రజలు వినియోగించుకోవాలని ఆయన పిలుపునిచ్చారు.

### కోహెడలో ఘనంగా

# శ్రీరామ నవమి వేడుకలు

**- రాములోరి కల్యాణ వైభోగం**



**కోహెడ** సిద్దిపేట జిల్లా కోహెడ మండలం కోహెడ గ్రామంలో శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయంలో అంగరంగ వైభవంగా వేలాది మంది భక్తజనుల రామనామస్మరణ కళ్యాణం జరిగింది. జగద్రక్షకుడు అఖిలండాకోటి బ్రహ్మానీడ నాయకుడు అర్థ జన రక్షకుడు భక్తజన పోషకుడు శ్రీ సీతారామచంద్రస్వామి కల్యాణోత్సవం అభిజిత్ కర్కాటక లగ్న పుష్కరంశ ముహూర్తంలో వైదిక నిర్వాహకులు బ్రహ్మశ్రీ డాక్టర్. కోహెడ ప్రసాదరావు శర్మ సారథ్యంలోని, బ్రహ్మణోత్తముల మంత్రోర్చనల నడుమ కనుల పండుగగా జరిగింది. అనంతరం భక్తులకు అన్నప్రసాదం స్వీకరించారు.ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, కోహెడ గ్రామ సర్పంచ్ బందెల సుజాత, వివిధ పార్టీల నాయకులు గ్రామ మరియు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు మహిళలు పెద్దఎత్తున పాల్గొన్నారు.

# మేము క్రీడలు ఆడి ఒలింపిక్స్‌కి వెళ్లేది ఏమీ లేదు

హైదరాబాద్‌లోని ఎల్బీ స్టేడియం వేదికగా ఈ క్రీడా పోటీలు జరగనున్నట్లు స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ప్రకటించిన సంగతి తెలిసిందే. అయితే ఈ లెజిస్లేటర్ స్పోర్ట్స్ మీట్–2026కు బీఆర్ఎస్ సభ్యులు హాజరుకావడం లేదు అని ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వెల్లడించారు. తెలంగాణ ప్రభుత్వం ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల కోసం నిర్వహిస్తున్న క్రీడా పోటీలపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో అన్ని రంగాల ప్రజలు అనేక సమస్యలు, సంక్షోభాలు ఎదుర్కొంటున్న సమయంలో ఇటువంటి క్రీడా కార్యక్రమాలలో పాల్గొని సమయం వృథా చేయడం తగదని స్పష్టం చేశారు. 'మేము ఎమ్మెల్యేలుగా ఈ క్రీడా పోటీలలో పాల్గొనబోమని కేటీఆర్ వెల్లడించారు. సభను కనీసం ఇంకో 10 రోజులు కొనసాగించి ప్రజా సమస్యలపై విస్తృతంగా చర్చించాల్సిన అవసరం ఉందని, అనేక కీలక అంశాలు ఇంకా పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. ప్రజలకు సంబంధించిన సమస్యలను పక్కనబెట్టి, అర్థాంతరంగా అసెంబ్లీని వాయిదా వేసి క్రీడలు నిర్వహించడం ప్రజలు సమర్థించరని, ఇది మంచి పరిణామం కాదని ఆయన అన్నారు. ప్రభుత్వం కూడా ఈ క్రీడా పోటీలపై పునరాలోచన చేయాలి' అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సూచించారు.'మేము క్రీడలు ఆడి ఒలింపిక్స్‌కి వెళ్లేది ఏమీ లేదు. క్రీడలను ప్రోత్సహించాలంటే పిల్లలకు అవకాశాలు కల్పించి, వారికి ప్రోత్సాహకాలు ఇవ్వాలి. ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో ఆటలు ఆడించడం వల్ల ప్రజలకు ఎలాంటి ప్రయోజనం ఉండదు'అని కేటీఆర్ పేర్కొన్నారు.అయితే ఎవరైనా క్రీడల్లో పాల్గొనాలనుకుంటే ముందుగా ప్రజా సమస్యలపై చర్చలు పూర్తిచేసి, శాసనసభను నిరవధికంగా వాయిదా వేసిన తర్వాత రెండు రోజులపాటు క్రీడలు నిర్వహించుకోవచ్చని సూచించారు. అసెంబ్లీ వాయిదా వేసి క్రీడలు నిర్వహించడం హాస్యాస్పదమని ఆయన విమర్శించారు. ఈ పరిణామాలు చూస్తే ప్రభుత్వానికి ప్రజా సమస్యల పట్ల ఉన్న చిత్తశుద్ధి అర్థమవుతుందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు.

# టీవీ రేటింగ్స్‌పై కేంద్రం కొత్త పాలసీ

ముఖ్య ఉద్దేశం.రేటింగ్ ఏజెన్సీల నిష్పాక్షికతను, స్వతంత్రతను కాపాడేందుకు పాలసీలో కఠినమైన నిబంధనలు చేర్చారు. ఏజెన్సీల బోర్డ్ ఆఫ్ డైరెక్టర్లలో కనీసం సగం మంది బ్రాడ్‌కాస్టర్లు, ప్రకటనకర్తలు లేదా అడ్వర్టైజింగ్ ఏజెన్సీలతో ఎలాంటి సంబంధం లేని స్వతంత్రులుగా ఉండాలని తప్పనిసరి చేశారు. అలాగే, తమ నిష్పాక్షికతకు భంగం కలిగించేలా ఎలాంటి కన్సల్టెన్సీ పనులు చేపట్టకుండా ఏజెన్సీలపై నిషేధం విధించారు. డేటా కచ్చితత్వాన్ని మెరుగుపరిచేందుకు, శ్యాంపిల్ సైజును భారీగా పెంచాలని ఆదేశించింది. ప్రస్తుతం ఉన్న ఏజెన్సీలు ఆరు నెలల్లోగా, కొత్తగా వచ్చేవి 18 నెలల్లోగా తమ మీటర్డ్ ఇళ్ల సంఖ్యను 80,000కు పెంచాలి. భవిష్యత్తులో ఈ సంఖ్యను 1,20,000 ఇళ్లకు విస్తరించనున్నారు. అంతేకాకుండా, కేబుల్, డీటీహెచ్, ఓటీటీ ప్లాట్‌ఫామ్‌లు, కనెక్టెడ్ టీవీలతో సహా అన్ని మాధ్యమాల్లో వీక్షకుల డేటాను సేకరించేలా సాంకేతికతతో సంబంధం లేకుండా ఈ వ్యవస్థను రూపొందించారు.పారదర్శకతకు పెద్దపీట వేస్తూ, రేటింగ్ ఏజెన్సీలు తాము అనుసరించే పద్ధతులను, అనామక డేటాను తమ వెబ్‌సైట్లలో ప్రచురించాలని ఆదేశించారు. అదే సమయంలో, వీక్షకుల వ్యక్తిగత సమాచార భద్రత కోసం 'డిజిటల్ పర్సనల్ డేటా ప్రొటెక్షన్ యాక్ట్, 2023'కు కట్టుబడి ఉండాలని స్పష్టం చేశారు. జవాబుదారీతనాన్ని పెంచేందుకు ద్వంద్వ ఆడిట్ విధానాన్ని ప్రవేశపెట్టారు. దీని ప్రకారం త్రైమాసిక అంతర్గత ఆడిట్లు, వార్షిక బాహ్య ఆడిట్లు నిర్వహించాల్సి ఉంటుంది. వీటికి అదనంగా, క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహించేందుకు మంత్రిత్వ శాఖ ఒక 'ఆడిట్ అండ్ ఓవర్‌సైట్ టీమ్'ను కూడా ఏర్పాటు చేయనుంది. ఈ మార్పులతో బ్రాడ్‌కాస్టింగ్ రంగంలో విశ్వసనీయమైన, పారదర్శకమైన వాతావరణం ఏర్పడుతుందని ప్రభుత్వం భావిస్తోంది.

# ఇక తెలంగాణ ఆడబిడ్డ పార్టీ

అదే రోజు పార్టీ పేరు, జెండాను ప్రకటిస్తామన్నారు. శ్రీరామనవమి మంచి రోజు కాబట్టి ఇవాళ ప్రకటన చేస్తున్నట్లు చెప్పారు. యువత, మహిళలకు మా పార్టీలో మంచి స్థానం ఉంటుంది. ఇన్నాళ్లూ మగవాళ్లు ఏర్పాటు చేసిన పార్టీలను చూశారు. తెలంగాణ ఆడబిడ్డగా నేను పార్టీ పెడితే ఎలా ఉంటుందో మీరే చూస్తారని అన్నారు. ఈ మేరకు నూతన రాజకీయ పార్టీపై గతకొంతకాలంగా వస్తున్న ఊహాగానాలకు తెరదించుతూ తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత కీలక ప్రకటన చేశారు. ఏప్రిల్ 25న ఉదయం 10 గంటలకు కొత్త పార్టీని స్థాపించనున్నట్లు తెలిపారు. మేడ్చల్‌లోని మునీరాబాద్ వద్ద అద్వయ ఫంక్షన్ హాలులో జెండా ఆవిష్కరణ చేస్తామని ప్రకటించారు. ఆ సమయంలోనే పార్టీ పేరును కూడా ప్రకటించనున్నట్లు తెలిపారు. కార్యకర్తలంతా సమయానికి చేరుకోవాలని, ప్రతి గ్రామం నుంచి తరలి రావాలని కవిత పిలుపునిచ్చారు. జయశంకర్ పేరు పెట్టుకుంటామని చెప్పారు. యువతకు, మహిళలకు ప్రాధాన్యం ఇస్తామని వెల్లడించారు. ఆడబిడ్డల్లో మార్పు తేవడానికి ఒక ఆడబిడ్డగా ఈ పార్టీని పెడుతున్నానని తెలిపారు. బీసీ బిల్లు సాధించడం తమ వల్లనే సాధ్యమవుతుందని అన్నారు. బీసీలు, దళితులు, గిరిజనులు, మైనారిటీలు తరలిరావాలని కవిత పిలుపునిచ్చారు. తెలంగాణ రాజకీయాలను శ్రీరాముడి స్ఫూర్తితో గమనించాలని కవిత అన్నారు. 'నేను నిజామాబాద్ బిడ్డను.. నిజామాబాద్ మట్టి మంచిది.. ఇక్కడ తీసుకునే ఏ నిర్ణయమైనా సక్సెస్ అయింది' అని తెలిపారు. నీళ్లు, నిధులు, నియామకాలు సంపూర్ణంగా సాధించలేకపోయామన్నారు. రోజూ ప్రజల అవస్థలు చూస్తున్నామని కవిత వ్యాఖ్యానించారు. కచ్చితంగా ఒక కొత్త రాజకీయ పార్టీ రావాల్సిన అవసరం ఉందన్నారు. అందరూ మెచ్చేలా ఆ పార్టీ ఉండాలని అభిప్రాయపడ్డారు. సర్వోదయ తెలంగాణ రావాలని కవిత పేర్కొన్నారు. మేము ఎవ్వరికీ బీ పార్టీ కాము. మాది నంబర్ వన్ పార్టీ అవుతుంది. శ్రీరాముడి స్ఫూర్తితో, సిద్ధాంతాలను ఆదర్శంగా తీసుకుని పని చేస్తాం. ఎక్కడి నుంచి పోటీ చేయాలనేది పార్టీలో చర్చించి నిర్ణయం తీసుకుంటాం. 95 శాతం తెలంగాణ ప్రాంతీయ పార్టీగా, ఇంటి పార్టీగా రాబోతోంది. ప్రజా సమస్యలపై వెంటపడి అడగాలి. ఎంపీ అర్వింద్ మతిమరుపు నాయకుడు. రైల్వే ఓవర్ బ్రిడ్జ్‌ల జాప్యానికి నేనే కారణం అన్నారు. ఆయన వచ్చాక ఏం చేస్తున్నారు. అవసరమైతే ఢిల్లీలో లాబీ చేస్తా, గల్లీలో పని చేస్తా' అని కవిత స్పష్టం చేశారు.

### ఆధ్యాత్మిక వాతావరణంలో

# సీతారాముల కళ్యాణం.

**- కుటుంబంతో హాజరైన శ్రీనివాస్ బాబు.**



**జయశంకర్ భూపాలపల్లి.**జయశంకర్ భూపాలపల్లి జిల్లా, కాటారం మండలం, ధన్వాడ గ్రామంలోని శ్రీ దత్తాత్రేయ స్వామి వారి ఆలయ ప్రాంగణంలో అత్యంత భక్తిశ్రద్ధలతో,శుక్రవారం ఘనంగా నిర్వహించిన శ్రీ సీతారాముల కళ్యాణ మహోత్సవంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి దుద్దిళ్ల శ్రీనివాస్ బాబు కుటుంబ సమేతంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కళ్యాణ మండపం వద్ద స్వామి వారి దివ్య కళ్యాణాన్ని కుటుంబ సభ్యులతో కలిసి భక్తిశ్రద్ధలతో ప్రత్యక్షంగా దర్శించుకున్నారు. కళ్యాణ వేడుకల సమయంలో హారతి ఇచ్చి, ప్రత్యేక పూజలు నిర్వహించి, స్వామి వారి ఆశీర్వాదాలు పొందారు. ఆధ్యాత్మిక వాతావరణంలో జరిగే ఈ పవిత్ర వేడుకలో పాల్గొనడం తనకు ఎంతో ఆనందాన్ని కలిగించిందని, ఇలాంటి దైవ కార్యక్రమాలు మన సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకలని పేర్కొన్నారు. అనంతరం గ్రామ ప్రజలతో స్నేహపూర్వకంగా మాట్లాడిన శ్రీనివాస్ బాబు ప్రతి కుటుంబం సుఖశాంతులతో ఆయురారోగ్యాలతో అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. అభివృద్ధి, ప్రజల సంక్షేమం తన ప్రధాన లక్ష్యమని ఎప్పటికప్పుడు ప్రజలతో కలిసి ఉండి వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు.

# కమనీయం..సీతారామ కళ్యాణం

విమానాశ్రయం నుంచి కుటుంబసమేతంగా సారపాక హెలిప్యాడ్‌కు చేరుకున్నారు. అనంతరం రోడ్డుమార్గాన భద్రాద్రి రాములవారి ఆలయం వద్దకు వెళ్లారు. రాష్ట్ర ప్రభుత్వం తరపున స్వామిఅమ్మవార్ల వివాహ మహోత్సవానికి పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించారు. ఉదయం 11:35 నుంచి మధ్యాహ్నం 12:25 వరకు మిథిలా స్టేడియంలో జరిగిన శ్రీ సీతారాముల కల్యాణ మహోత్సవంలో పాల్గొన్నారు. అనంతరం సారపాక హెలిప్యాడ్ నుంచి హైదరాబాద్‌కు తిరిగి బయలుదేరారు.

# యుద్ధం వేళ సీఎంలతో ప్రధాని భేటీ

కూడా హాజరయ్యారు. పార్లమెంట్‌లో పశ్చిమాసియా యుద్ధ పరిణామాలు, చమురు, గ్యాస్ సంక్షోభం నివారణకు భారత్ తీసుకుంటున్న చర్యల గురించి ప్రధాని మోదీ ప్రసంగించిన సంగతి తెలిసిందే. పెరుగుతున్న ప్రపంచ ఉద్రిక్తతల దృష్ట్యా, ఇంధన సరఫరా, ద్రవ్యోల్బణం, లాజిస్టిక్స్ అంశాలపై ప్రధానంగా చర్చించారు. ఈ పరిస్థితి వల్ల తలెత్తే ఏవైనా పరిణామాలను ఎదుర్కోవడానికి సంసిద్ధతను కూడా ఈ సమావేశంలో సమీక్షించారు.పశ్చిమాసియాలో నెలకొన్న అస్థిరత కారణంగా భారత్‌కు ఇంధన సంక్షోభం ముప్పు పొంచి ఉంది. క్రూడాయిల్, గ్యాస్ సరఫరాల్లో ఆటంకాలు ఏర్పడుతున్నాయి. అంతర్జాతీయంగా సరఫరా గొలుసు దెబ్బతినడంతో రాష్ట్ర ప్రభుత్వాలు అప్రమత్తంగా ఉండాలని, పరిణామాలను ఎదుర్కొండానికి సిద్ధంగా ఉండాలని ముఖ్యమంత్రులకు మోదీ సూచించినట్టు తెలుస్తోంది. అయితే, సంక్షోభాన్ని ఎదుర్కొడానికి తీసుకోబోయే చర్యల గురించి ముఖ్యమంత్రులు సైతం ప్రధానికి తమ అభిప్రాయాలను తెలియజేసినట్టు సమాచారం. అలాగే, దేశంలో మరోసారి లాక్‌డౌన్ విధిస్తారని జరుగుతోన్న ప్రచారాన్ని కేంద్రం ఖండించిన సంగతి తెలిసిందే. ఇక, పశ్చిమాసియాలో యుద్ధం ఇప్పట్లో ముగిసే సూచనలు కనుచూపు మేరలో కనిపించడం లేదు. చర్చలు జరుపుతున్నామని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చెబుతున్నా ఇరాన్‌పై ఇజ్రాయెల్– అమెరికా సైన్యం దాడులు కొనసాగుతున్నాయి. అటు, గల్ఫ్ దేశాల్లోని అమెరికా స్థావరాలు, ఇంధన మౌలిక సదుపాయాలపై క్షిపణులు, డ్రోన్లతో 83 వ విడత దాడులు ప్రారంభించినట్టు ఇరాన్ ప్రకటించింది. యూఏఈ శుక్రవారం తాము 9 క్షిపణులు, 6 డ్రోన్లను అడ్డుకున్నామని ప్రకటించింది.

# ప్రపంచ టెలికాం వ్యవస్థలకు పెనుముప్పు

తన నివేదికలో హెచ్చరించింది. ఈ హ్యాకర్లు "డిజిటల్ స్లీపర్ సెల్స్" తరహాలో పనిచేసే అత్యాధునిక టూల్స్‌ను వాడుతున్నారని నివేదిక తెలిపింది. కెర్నల్–స్థాయి ఇంప్లాంట్లు, పాసివ్ బ్యాక్‌డోర్స్ వంటివి నెట్‌వర్క్‌లలో చాలాకాలం పాటు గుర్తించబడకుండా దాగి ఉండేందుకు వీలు కల్పిస్తాయి. తద్వారా, వ్యవస్థలను నిశ్శబ్దంగా పర్యవేక్షిస్తూ, తమ ఉనికి బయటపడకుండా హ్యాకర్లు యాక్సెస్‌ను కొనసాగిస్తారు. ప్రభుత్వ, కీలక కమ్యూనికేషన్ నెట్‌వర్క్‌లపై నిఘా పెట్టడమే వీరి లక్ష్యమని నిపుణులు భావిస్తున్నారు.ఈ దాడుల్లో "బీపీఎఫ్‌డోర్" అనే లినక్స్ ఆధారిత బ్యాక్‌డోర్‌ను ప్రధానంగా ఉపయోగిస్తున్నట్టు రాపిడ్7 గుర్తించింది. ఇది సిస్టమ్ కెర్నల్‌లోనే దాగి ఉంటూ, నెట్‌వర్క్ ట్రాఫిక్‌ను గమనిస్తుంది. డేటా ప్యాకెట్లలో ఒక ప్రత్యేకమైన రహస్య సిగ్నల్ వచ్చినప్పుడు మాత్రమే ఇది యాక్టివేట్ అవుతుంది. సిస్కో, ఫోర్టినెస్, వీఎమ్‌వేర్, ఇవాంటీ వంటి ప్రముఖ కంపెనీల సిస్టమ్స్‌లోని లోపాలను హ్యాకర్లు తమకు అనుకూలంగా మార్చుకుంటున్నారు. కేవలం ఒక్కో సిస్టమ్‌ను హ్యాక్ చేయడమే కాకుండా, టెలికాం నెట్‌వర్క్‌లకు గుండెకాయలాంటి కోర్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌పై పట్టు సాధించడమే ఈ ఆపరేషన్ లక్ష్యమని నివేదిక స్పష్టం చేసింది. కమ్యూనికేషన్ వ్యవస్థల వెన్నెముకనే లక్ష్యంగా చేసుకోవడం వల్ల ఈ దాడులు అత్యంత ప్రమాదకరమని సైబర్ నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీనివల్ల భవిష్యత్తులో డేటా ప్రవాహాన్ని పర్యవేక్షించడం, సేవలకు అంతరాయం కలిగించడం వంటివి చేసే అవకాశం హ్యాకర్లకు లభిస్తుంది.

# లఢఖ్‌లో భారీగా మంచు తుపాను

మంచు కింద కొన్ని వాహనాలు పూర్తిగా కూరుకుపోయినట్లు గుర్తించారు. వాటిని వెలికితీయగా ఆరు మృతదేహాలు లభ్యమయ్యాయి. గాయపడిన ఐదుగురిని రక్షించి చికిత్స నిమిత్తం సమీప ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనతో శ్రీనగర్–లేహ్ జాతీయ రహదారిపై రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. శిథిలాలను తొలగించి, మార్గాన్ని పునరుద్ధరించేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. శ్రీనగర్ నుంచి లేహ్ వరకు ఉన్న ఈ 434 కిలోమీటర్ల పొడవైన రహదారి వ్యూహాత్మకంగా చాలా కీలకమైనది. సుమారు 11,575 అడుగుల ఎత్తులో ఉండే జోజిలా పాస్ మీదుగా ఇది వెళుతుంది. ఈ మార్గంలో తరచూ హిమపాతాలు సంభవిస్తుండటంతో, ఏడాది పొడవునా సురక్షిత ప్రయాణం కోసం జోజిలా పాస్ కింద భారీ సొరంగం నిర్మాణంలో ఉంది. ఈ టన్నెల్ పూర్తయితే ఇలాంటి ప్రమాదాలను నివారించవచ్చని, పర్యాటక రంగంతో పాటు సైనిక దళాల తరలింపునకు కూడా ఎంతో ప్రయోజనం చేకూరుతుందని భావిస్తున్నారు.

# ఆటల బరిలోకి తెలంగాణ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు

రాష్ట్ర ప్రభుత్వం ఒక కమిటీని కూడా ఏర్పాటు చేశారు. కమిటీ ఛైర్మన్‌గా రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు కో ఛైర్మన్‌గా క్రీడా శాఖ మంత్రి వాకిటి శ్రీహరిని నియమించారు. అదే సమయంలో రవీంద్ర భారతిలో సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేయనున్నారు.తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ఇలాంటి ఆటల పోటీలు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు నిర్వహించడం ఇదే తొలిసారి కావడం గమనార్హం. ఈ కమిటీకి కన్వీనర్‌గా ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్ సహా మరో 13 మంది ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను సభ్యులుగా ప్రభుత్వం నియమించింది.

గురువారం అసెంబ్లీ కమిటీ హాల్‌లో సమావేశమైన ఈ కమిటీ ప్రజా ప్రతినిధులకు నిర్వహించనున్న పోటీల నిర్వహణపై సమీక్ష చేపట్టింది. నేడు మధ్యాహ్నం 3:30 గంటలకు ఎల్బీ స్టేడియంలో క్రీడలు ప్రారంభం కానున్నట్లు కమిటీ స్పష్టం చేసింది.ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల మధ్య స్నేహపూర్వక వాతావరణాన్ని పెంపొందించడంతోపాటు రాష్ట్ర ప్రజల్లో క్రీడా స్ఫూర్తిని నింపడం కోసమే ఈ ఆటల పోటీలు నిర్వహిస్తున్నట్లు స్పోర్ట్స్ కమిటీ ఛైర్మన్, మంత్రి జూపల్లి కృష్ణారావు కో ఛైర్మన్ మంత్రి వాకిటి శ్రీహరి తెల్పి చెప్పారు. అంతకుముందు స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌ను కలిసిన మంత్రులు శ్రీధర్ బాబు, అడ్లూరి లక్ష్మణ్, ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్, స్పోర్ట్స్ అథారిటీ ఛైర్మన్ శివసేనారెడ్డి స్పోర్ట్స్ కిట్‌ను అందించారు. ఈ సందర్భంగా మాట్లాడిన మంత్రులు ఈ నెల 28, 29వ తేదీల్లో ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు మొదటి ఎడిషన్ లెజిస్లేటర్ స్పోర్ట్స్ మీట్--2026 ఆటల పోటీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. రవీంద్ర భారతిలో సాంస్కృతిక కార్యక్రమాలను ఘనంగా నిర్వహించేందుకు కావాల్సిన ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులను ప్రభుత్వం ఆదేశించింది.

# హర్మూజ్‌లో తీవ్ర ఉద్రిక్తత

జెండా చాటున చమురును అక్రమంగా అమెరికాకు తరలిస్తున్నారని, దానికి ప్రతీకారంగానే ఈ దాడి జరిగిందనే కథనాలు వినిపిస్తున్నాయి. ట్యాంకర్‌కు మంటలు అంటుకుని, పూర్తిగా ధ్వంసమైన దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. ఈ ఘటనలో సిబ్బంది ప్రాణనష్టంపై ఇంకా స్పష్టత రాలేదు.

ఫిబ్రవరి 28న ఇరాన్‌పై అమెరికా–ఇజ్రాయెల్ దళాలు దాడులు చేసినప్పటి నుంచి హర్మూజ్ జలసంధిని ఇరాన్ తన నియంత్రణలోకి తీసుకుంది. తమ అనుమతి లేకుండా ఏ నౌక ప్రవేశించరాదని ఆంక్షలు విధించింది. దీంతో ప్రపంచ చమురు సరఫరాలో 20 శాతం స్తంభించిపోగా, 85కి పైగా ట్యాంకర్లు గల్ఫ్‌లోనే చిక్కుకుపోయాయి. మార్చి 11న కూడా థాయ్‌లాండ్‌కు చెందిన నౌకపై దాడి జరిగింది. ఈ సంక్షోభం కారణంగా అంతర్జాతీయ మార్కెట్లో ముడి చమురు ధరలు భగ్గుమంటున్నాయి. బ్రెంట్ క్రూడ్ ధర బ్యారెల్‌కు 100 డాలర్లను దాటింది. తాజా ఘటనతో ఈ ప్రాంతంలో యుద్ధ మేఘాలు మరింత దట్టమయ్యాయి. సంక్షోభం ముదరకుండా దౌత్యపరమైన ప్రయత్నాలు జరుగుతున్నాయి.

# హైదరాబాదులో శ్రీరామనవమి శోభాయాత్రను ప్రారంభించిన గవర్నర్ శివప్రతాప్ శుక్లా

**హైదరాబాద్** నగరంలో శ్రీరామనవమి శోభాయాత్రను రాష్ట్ర గవర్నర్ శివప్రతాప్ శుక్లా ప్రారంభించారు. సీతారాంబాగ్ ఆలయం నుంచి కోఠిలోని హనుమాన్ వ్యాయామశాల వరకు ఈ శోభాయాత్ర కొనసాగుతుంది. శోభాయాత్రను ప్రారంభించిన అనంతరం గవర్నర్ మాట్లాడుతూ, ఏళ్ల తరబడి నగరంలో శ్రీరామ శోభాయాత్ర ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించడం అభినందనీయమని అన్నారు.

భారతీయ సంస్కృతిలో రామాయణానికి చాలా విశిష్ఠత ఉందని అన్నారు. ఆదర్శ కుమారుడు, ఆదర్శ భర్త, ఆదర్శ పురుషుడుగా శ్రీరాముడిని అందరూ స్ఫూర్తిగా తీసుకోవాలని కోరారు. ఐకమత్యం, భక్తిభావనకు శోభాయాత్ర నిదర్శనంగా నిలుస్తోందని గవర్నర్ అన్నారు.



మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా న్యాయస్థానశీ మల్కాజ్గిరి బార్ అసోసియేషన్ ఎన్నికల్లో ఎన్నికైనటువంటి బార్ నూతన అసోసియేషన్ సభ్యులు లైబ్రరీ సెక్రటరీ గా ఎన్నికైనటువంటి డి. సాయినాథ్ గౌడ్ కు హృదయ పూర్వక శుభాకాంక్షలు.



తెలుగు దినపత్రిక https://aksharagalam.com

# అక్షరగళం

ప్రతి అక్షరం ప్రజల కోసం

## తెలంగాణ రౌండప్

శనివారం - 28 మార్చి 2026 - పేజీలు


## మల్లారెడ్డి నగర్ ఫేస్ వన్‌లో కనుల పండుగగా

# శ్రీ సీతారాముల కళ్యాణ మహోత్సవం

### - పెద్ద సంఖ్యలో పాల్గొన్న భక్తులు



**అక్షర గళం, కుత్బుల్లాపూర్ :**
శ్రీ రామ నవమి పర్వదినం సందర్భంగా శుక్రవారం గాజులరామారం డివిజన్ పరిధి మల్లారెడ్డి నగర్ ఫేస్ వన్ లోని రోడ్ నెంబర్ 3లో శ్రీ సీత రాముల కళ్యాణ మహోత్సవం కాలనీ అసోసియేషన్ ఆధ్వర్యంలో కనుల పండుగగా నిర్వహించారు. వేద పండితుల వేదమంత్రో చరణాల నడుమ సాంప్రదాయ సిద్ధంగా సీతారాముల కళ్యాణాన్ని భక్తి శ్రద్ధలతో ఘనంగా జరిపించారు. కాలనీ సభ్యులు, కాలనీ వాసులు హాజరై సీతారాముల కల్యాణ మహోత్సవాన్ని తిలకించారు. సుమారు 700 మందికి పైగా భక్తులు హాజరై, కళ్యాణం ముగిసే వరకు భక్తి శ్రద్ధలతో నిలిచి దర్శనం పొందడం ఈ వేడుకకు విశేష గౌరవాన్ని తీసుకువచ్చింది. మొట్టమొదటి సారి నిర్వహించిన ఈ దివ్య కళ్యాణం శ్రీరాముని మహిమను ప్రతిబింబించే సాంస్కృతిక కార్యక్రమాలతో అద్భుతంగా అలరించింది. సాయంత్రం జరిగిన శ్రీరామ పరివార పల్లకి సేవ మల్లారెడ్డి నగర్ 8 రోడ్లలో భక్తులకు దివ్య దర్శనం కలిగించి, ఆధ్యాత్మిక వాతావరణాన్ని సృష్టించింది. ఈ మహోత్సవంలో మాజీ అధ్యక్షులు కే. బాలరాజు, దంపనబోయిన శ్రీనివాసు, దయాకర్ రెడ్డి, శ్రీ లక్ష్మి రెడ్డి, మల్లా రెడ్డి నగర్ ప్రెసిడెంట్ వై.పద్మ గిరి, జనరల్ సెక్రెటరీ సికందర్, వైస్ ప్రెసిడెంట్స్ ఓంకార్ రెడ్డి , చింత, శివరాజ్, హనుమంత్ రెడ్డి ,జాయింట్ సెక్రెటరీస్ రామ్ రెడ్డి , కిష్ట రెడ్డి ,ట్రెజరర్ సూర్య చంద్ర రావు , నారాయణ నాయుడు, ఆర్గనైజింగ్ సెక్రెటరీస్ సుబ్బిరామి రెడ్డి,కిష్ట రెడ్డి , కల్చరల్ సెక్రెటరీస్ పెంటేష్ , రవి చంద్ర ,అడ్వైజర్స్ తెలంగాణ సాయి, ఎ.వి. రావ్,టి. రమేష్, ఎగ్జిక్యూటివ్ మెంబెర్స్ సంతోష్ రెడ్డి, మల్లికార్జున్, బ్రహ్మం, బి.సుందర్, శ్రీనివాస్ రావు, వెంకట్ రెడ్డి , కాలనీ మెంబెర్స్ ,కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.













## కన్నుల పండువగా శ్రీరామనవమి వేడుకలు

### - భక్తులతో కిక్కిరిసిన దేవాలయాలు



యాచారం, అక్షరగళం :- మండల వ్యాప్తంగా శ్రీరామనవమి వేడుకలు శుక్రవారం భక్తులు ఎంతో వైభవోపేతంగా నిర్వహించారు. శ్రీ సీతారామచంద్రస్వామి కళ్యాణ మహోత్సవంతో అన్ని గ్రామాలు ఆధ్యాత్మిక వాతావరణాన్ని సంతరించుకున్నాయి. నల్లవెల్లి బొగ్గుల గుట్టపై చైర్మన్ గండికోట యాదయ్య ఆధ్వర్యంలో సర్పంచ్ సభావత్ కిషన్ నాయక్ దంపతులు కళ్యాణం జరిపించారు. ఇబ్రహీంపట్నం ఏసీపీ కేపివి రాజు ముఖ్యఅతిధిగా హాజరయ్యారు. కుర్మిద్ద గ్రామంలోని శ్రీ సత్యనారాయణ స్వామి దేవాలయంలో చైర్మన్ బందే మహేందర్ రెడ్డి దంపతులు, సర్పంచ్ నీలం శ్రీవిద్య శ్రీ రాములు, ఉప సర్పంచ్ అనేమోని రవీందర్ దంపతులు సీతాసామేతుడైన శ్రీరామచంద్రున్ని ఉత్సవ విగ్రహాలను ఊరేగింపుగా ఆలయానికి తీసుకొచ్చారు. భాజాభజంత్రీలు, వేదమంత్రాలు, ముత్యాల తలంబ్రాలతో సీతారాముల కల్యాణాన్ని ఎంతో కమనీయంగా నిర్వహించారు. ఈ వేడుకలను తిలకించేందుకు భక్తులు తండోపతండాలుగా తరలివచ్చారు. అనంతరం బందే వసంతమ్మ కిషన్ రెడ్డి దంపతులు నిర్వహించిన అన్నదానంలో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని తీర్థప్రసాదాలను స్వీకరించారు. సాయంత్రం గ్రామాల్లో ఊరేగింపు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నల్లవెల్లి మాజీ ఎంపీటీసీ లక్ష్మీపతి గౌడ్, కాసాని రవి గౌడ్, యాదయ్య, కుర్మిద్దలో భజన మండలి గౌరవ అధ్యక్షులు, పోలోజు పుల్లచారి, అధ్యక్షులు కామేటి అంజయ్య, వార్డు సభ్యులకు, గ్రామపెద్దలు, భక్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.



అక్షరగళం

శనివారం, మార్చి 28, 2026

## కూకట్‌పల్లి కోర్టు బార్ కౌన్సిల్ అధ్యక్ష కార్యదర్శులుగా

# గోవర్ధన్ రెడ్డి, కె. సురేందర్ గౌడ్‌లు





అక్షర గళం, కూకట్ పల్లి : కూకట్‌పల్లి కోర్టు బార్ కౌన్సిల్ ఎన్నికలు గురువారం ఘనంగా ముగిశాయి. న్యాయవాదులు పెద్ద సంఖ్యలో పాల్గొని తమ ఓటు హక్కును వినియోగించుకోవడంతో కోర్టు ప్రాంగణం ప్రజాస్వామ్య స్ఫూర్తిని ప్రతిబింబించింది. ప్రశాంత వాతావరణంలో జరిగిన ఈ ఎన్నికల్లో కొత్త కార్యవర్గం పోటీ ద్వారా ఎన్నికైంది. ఈ ఎన్నికల్లో అధ్యక్షుడిగా గోవర్ధన్ రెడ్డి విజయం సాధించగా, ప్రధాన కార్యదర్శిగా కె. సురేందర్ గౌడ్, ఉపాధ్యక్షులుగా బి. సత్యనారాయణ, కె. శ్రీదేవి లు సంయుక్త కార్యదర్శిగా శివ ప్రసాద్ గౌడ్, కోశాధికారిగా కె. గోపాల్ రెడ్డి, క్రీడా కార్యదర్శిగా ఎన్. రమేష్, సాంస్కృతిక కార్యదర్శిగా వి. శ్రీలత, మహిళా ప్రతినిధిగా చి. ప్రత్యూష ఎన్నికయ్యారు. అదనంగా కార్యవర్గ సభ్యులుగా సోను మిత్తల్, ఎస్. ధనలక్ష్మి, శ్రీకాంత్ టి, నవీన్ కుమార్ ఎం, సందీప్ రెడ్డి ఎస్, కల్యాణి జి, వి. అరవింద్ ఎన్నికయ్యారు. ఎన్నికల ప్రక్రియ మొత్తం క్రమబద్ధంగా, పారదర్శకంగా సాగినట్లు న్యాయవాదులు తెలిపారు. కొత్తగా ఎన్నికైన కమిటీ సభ్యులకు న్యాయవాదులు అభినందనలు తెలియజేస్తూ, వారి పదవీకాలంలో బార్ అభివృద్ధి, న్యాయవాదుల సంక్షేమం, వృత్తి గౌరవం పెంపొందించే దిశగా సమర్థవంతంగా పనిచేయాలని ఆకాంక్షించారు.

## చేయూత ఫౌండేషన్ ఆధ్వర్యంలో

# భక్తులకు మజ్జిగ పంపిణీ

**- ఫౌండేషన్ అధ్యక్షులు కల్వ రమేష్.**



**కల్వకుర్తి,మార్చ్ 27(అక్షరగళం):** శ్రీరామనవమి పర్వదిన సందర్భంగా కల్వకుర్తి పట్టణంలోని శ్రీ సీతారామాంజనేయ స్వామి దేవాలయంలో సీతారాముల కల్యాణానికి హాజరైన భక్తులకు శుక్రవారం కల్వకుర్తి చేయూత ఫౌండేషన్ అధ్యక్షులు కల్వ రమేష్ ఆధ్వర్యంలో ఆలయ ఆవరణలో కల్యాణాన్ని తిలకించడానికి విచ్చేసిన భక్తులకు మజ్జిగ పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవాలయ ట్రస్ట్ ఫౌండర్ జూలూరి రమేష్ బాబు హాజరై భక్తులకు మజ్జిగ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య మహాసభ జిల్లా అధ్యక్షుడు బచ్చు రామకృష్ణ చేయూత ఫౌండేషన్ గ్రూప్ సభ్యులు పాల్గొన్నారు.

## సిర్సనగండ్లలో


# సీతారాముల కల్యాణోత్సవం

**- స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పించిన మంత్రి జూపల్లి**



**కల్వకుర్తి, మార్చ్ 27(అక్షరగళం):** చారిత్రాత్మక పుణ్యక్షేత్రమైన సిర్సనగండ్లలో శ్రీరామ నవమి వేడుకలు కన్నుల పండువగా జరిగాయి. శుక్రవారం లోక కల్యాణం కోసం జరిగిన సీతారాముల కల్యాణోత్సవంలో పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు,అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ .లినాగర్ కర్నూల్ పార్లమెంట్ ఇంచార్జ్ ఎలుగొండ మధుసూదన్ రెడ్డి పాల్గొన్నారు. ఆలయానికి చేరుకున్న వారికి అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ప్రభుత్వం తరపున స్వామివారికి పట్టువస్త్రాలను, ముత్యాల తలంబ్రాలను సమర్పించారు. అనంతరంస్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేద మంత్రోచ్చారణలు, మంగళవాయిద్యాల మధ్య అర్చకులు సీతారాముల కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ వేడుకను తిలకించడానికి జిల్లా నలుమూలల నుంచి భక్తులు భారీగా తరలివచ్చారు. జై శ్రీరామ్ నామస్మరణతో ఆలయ ప్రాంగణం మారుమోగింది. దక్షిణ అయోధ్యగా తీర్చిదిద్దుతామని మంత్రి జూపల్లి అన్నారు..పూజా కార్యక్రమాల అనంతరం మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ సిర్సనగండ్ల క్షేత్రానికి ఉన్న విశిష్టతను కాపాడుతూ, భక్తులకు అన్ని రకాల సౌకర్యాలు కల్పించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ పుణ్యక్షేత్రాన్ని పర్యాటక పరంగా కూడా అభివృద్ధి చేస్తామని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, ఆలయ కమిటీ సభ్యులు, అధికారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఘనంగా శ్రీరామ నవమి వేడుకలు







**నాగారం, మార్చి 27,(అక్షర గళం) :** నాగారం లో ఘనంగా నిర్వహించిన శ్రీరామ నవమి వేడుకలు భక్తి శ్రద్ధల మధ్య వైభవంగా జరిగాయి. శుక్రవారం మల్కాజ్గిరి మున్సిపల్ కార్పొరేషన్ ఘట్కేసర్ సర్కిల్ నాగారం డివిజన్ పరిధిలో పలు కాలనీలలో సీతారాముల వారి కళ్యాణ మహోత్సవంలో నాగారం డివిజన్ కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ..శ్రీరాముని ఆదర్శ జీవితం ప్రతి ఒక్కరికీ మార్గదర్శకమని, సత్యం, ధర్మం, న్యాయం వంటి విలువలను మన జీవితాల్లో ఆచరించాల్సిన అవసరం ఉందని తెలిపారు. ఈ కార్యక్రమం లో నాగారం డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ముప్పు శ్రీనివాస్ రెడ్డి, మాజీ కౌన్సిలర్ పంగ హరిబాబు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గణపురం కొండల్ రెడ్డి,కాంగ్రెస్ పార్టీ ప్రజా ప్రతినిధులు,నాయకులు,తదితరులు పాల్గొన్నారు.

# ఇరాన్ పై అమెరికా-ఇజ్రాయిల్ యుద్ధాన్ని మోడీ ఖండించాలి

**- మోడీ వైఫల్యం వల్లే గ్యాస్ పెట్రోల్ డీజిల్ ఇబ్బందులు**

**- సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు తీగల సాగర్**




కల్వకుర్తి, మార్చ్ 27(అక్షరగళం):ఇరాన్ పై అమెరికా, ఇజ్రాయిల్ యుద్ధం ఆపాలని, ప్రపంచ శాంతి కోసం భారత ప్రభుత్వం ఇతర దేశాలతో కలిసి కృషి చేయాలని మోడీ వైఫల్యం వల్లే గ్యాస్ పెట్రోల్ డీజిల్ కొరత ఏర్పడి భారత ప్రజలు నానా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు తీగల సాగర్ అన్నారు . శుక్రవారం సిపిఎం ఏర్పాటుచేసిన సమావేశంలో మాట్లాడుతూ యుద్ధం వద్దు శాంతి ముద్దు గ్యాస్ పెట్రోల్ డీజిల్ కొరతను అరికట్టాల్సిన మన కేంద్ర ప్రభుత్వానికి ఉన్నదని కల్వకుర్తి పార్టీ కార్యాలయంలో జరిగిన సిపిఎం కార్యదర్శివర్గ సమావేశానికి హాజరైన ఆయన అమెరికా ఇజ్రాయిల్ దేశాలు అంతర్జాతీయ న్యాయ సూత్రాలకు విరుద్ధంగా కనీసం మానవత విలువలు పాటించకుండా దాడి చేయడాన్ని ప్రపంచమంతా ముక్త కంఠంతో ఖండించాలని అన్నారు. ఇరాన్ అంతర్జాతీయ అణు ఒప్పందానికి అనుగుణంగా విద్యుత్ ప్రయోజనాలకే అణు కార్యక్రమం చేపడతామని ప్రకటించిందన్నారు .ఇరాన్ అణుబాంబు తయారు చేయడం లేదని అమెరికా ఉగ్రవాద నిరోధక విభాగం ప్రకటించిందని అయినా అణ్వాయుధాలు ఉన్నాయనే నెపంతో దాడి చేయడం దుర్మార్గం అని అన్నారు. ఇరాన్ లో తన కీలుబొమ్మ ప్రభుత్వాన్ని ప్రతిష్ఠించి ఇరాన్ చమురు నిల్వలను కొల్లగొట్టాలనే కుట్రతోనే అమెరికా ఇలాంటి దుస్సాహసానికి పాల్పడిందని విమర్శించారు. భారత ప్రభుత్వం మన అలీన విదేశాంగ విధానాన్ని వదిలేసి అమెరికా ఇజ్రాయిల్ వైపు మొగ్గు చూపుతున్నదని, యుద్ధం ఆపడానికి కృషి చేయకుండా అమెరికాకు లొంగుబాటు వైఖరి తీసుకున్నదని దుయ్యబట్టారు. యుద్ధం వల్ల గ్యాస్ సిలిండర్ల ధరలు పెరిగి సాధారణ ప్రజల పైన వేల కోట్ల రూపాయల భారం పడింది. గ్యాస్, పెట్రోల్, డీజిల్ కొరత కారణంగా ప్రజలు క్యూ లైన్లలో నిలబడి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. హోటల్స్, హాస్టల్స్ మూతపడ్డాయి, వేలాది మంది ఉపాధి కోల్పోయారని అన్నారు. గల్ఫ్ దేశాలలో కోటి మంది భారతీయులు ఉపాధి పొందుతున్నారని యుద్ధం వల్ల వారి ప్రాణాలు, ఉపాధి ప్రమాదంలో పడ్డాయని అన్నారు. అమెరికాకు భయపడి యుద్ధం పట్ల నోరు మెదపకుండా ఉన్న మోడీ యుద్ధం వల్ల దేశం కరోనా నాటి పరిస్థితిని ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉండాలని ప్రజలకు పిలుపునివ్వడం సిగ్గుచేటని అన్నారు. ప్రపంచ శాంతి కోసం, యుద్ధాల వలన జరిగే నష్టాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రతి ఒక్కరు మోడీ విధానాలను ఖండించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి వరదం పర్వతాలు, తో పాటు జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఆర్. శ్రీనివాసులు కందికొండ గీత,ఎల్.దేశ్యనాయక్,బి.ఆంజనేయులు,సి.ఆంజనేయులు పాల్గొన్నారు.

## శ్రీ సీతారాముల కళ్యాణ మహోత్సవంలో పాల్గొన్న టిపిసిసి సీనియర్ అధికార ప్రతినిధి,

# మాజీ డిసిసి అధ్యక్షులు సింగిరెడ్డి హరివర్ధన్ రెడ్డి





**కీసర, మార్చి 27,(అక్షర గళం) :** శ్రీరామ నవమి పురస్కరించుకొని మేడ్చల్ నియోజకవర్గం లోని కీసర సర్కిల్ పరిధిలోని శ్రీ సీతారాముల దేవాలయంలో సీతారాముల కల్యాణ మహోత్సవంలో టీపీసీసీ సీనియర్ అధికార ప్రతినిధి మాజీ డిసిసి అధ్యక్షులు సింగిరెడ్డి హరివర్ధన్ రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఈ సందర్భంగా సింగిరెడ్డి హరివర్ధన్ రెడ్డి మాట్లాడుతూ...

భక్తి మార్గంలో నడిపించే శ్రీ రాముడి ఆశీర్వాదంతో ప్రతి ఇంట్లో సంతోషం ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ నియోజకవర్గం మాజీ శాసన సభ్యులు మల్లిపెద్ది సుధీర్ రెడ్డి,రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు కందడి అంజి రెడ్డి,కీసర మండలం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు,అనుబంధ సంస్థల అధ్యక్షులు,అనుబంధ సంస్థల చైర్మన్ లు,ప్రజా ప్రతినిధులు,భక్తులు,తదితరులు పాల్గొన్నారు.

# రామ"అనే రెండు అక్షరాలు ఎంతో మనోహరమైనవి

**- సీతారాముల కల్యాణ మహోత్సవాన్ని తిలకించిన**
**నాగారం డివిజన్ బీజేపీ పార్టీ ప్రముఖులు**







**నాగారం, మార్చి 27,(అక్షర గళం) :**"రామ"అనే రెండు అక్షరాలు ఎంతో మనోహరమైనవి, మధురమైనవి అని, శ్రీరాముని ఆదర్శాలను ప్రతి ఒక్కరూ అనుసరించాలని నాగారం డివిజన్ బీజేపీ పార్టీ ప్రముఖులు అన్నారు. శుక్రవారం ఘట్కేసర్ సర్కిల్ పరిధిలోని నాగారం డివిజన్ పరిధిలో పలు కాలనీలల్లో సీతారాముల కళ్యాణం ఆహ్వానం మేరకు బీజేపీ పార్టీ ప్రముఖులు పలు కాలనీలల్లోని దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి దేవుళ్లను దర్శించుకుని సీతారాముల కల్యాణ మహోత్సవాన్ని తిలకించారు. అనంతరం తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. అనంతరం ప్రజా ప్రతినిధులు మాట్లాడుతూ..ఇలాంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు సమాజంలో శాంతి, ఐక్యత, ధార్మిక చింతన పెంపొందిస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా బిజెపి మేడ్చల్ జిల్లా బిజెపి సీనియర్ నాయకులు తడిసిన సూర్య శేఖర్ రెడ్డి,బిజెపి సీనియర్ నాయకులు జూపల్లి నరేష్,ప్రధాన కార్యదర్శిలు మామిడి జంగారెడ్డి,పోతంశెట్టి వెంకటేశ్వర రావు,వల్లాల శ్రీనివాస్,సురేందర్ రెడ్డి,షాదీ,టెస్టర్ శీను,బిజెపి నాయకులు,పలు కాలనీల ప్రజలు, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

# సంపాదకీయం

## మహిళా లీడర్లు కావలెను

తెలుగు రాష్ట్రాల రాజకీయాల్లో గతంలో ఎన్నడూ లేని విధంగా ఒక భారీ మార్పు రాబోతోంది. నియోజకవర్గాల పునర్విభజనతో పెరగనున్న సీట్లు , మహిళా రిజర్వేషన్ బిల్లు అమలులోకి రానుండటంతో, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాజకీయ యవనికపై మహిళా నేతల హవా మొదలుకానుంది. ఇప్పటి వరకు పురుషాధిక్య రాజకీయాల్లో అవకాశాల కోసం ఎదురుచూసిన ఎంతో మంది చైతన్యవంతులైన మహిళలకు ఇది నిజంగానే గోల్డెన్ టైమ్ అని చెప్పవచ్చు. ప్రతి ముగ్గురు ఎమ్మెల్యేలలో ఒకరు కచ్చితంగా మహిళా నేతే ఉండబోతుండటంతో, ఇరు రాష్ట్రాల్లోని ప్రధాన పార్టీలు ఇప్పటి నుంచే మహిళా కేడర్‌ను సిద్ధం చేసే పనిలో పడ్డాయి.2029 అసెంబ్లీ ఎన్నికలు.. నియోజకవర్గాల పునర్విభజన తర్వాతే జరగడం ఖాయంగా కనిపిస్తోంది. దీంతోపాటు 33 శాతం మహిళా రిజర్వేషన్లు కూడా అమలు కానున్నట్టు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో రాష్ట్ర రాజకీయాల్లో ఆసక్తికర చర్చ మొదలైంది. ముఖ్యంగా అసెంబ్లీ సమావేశాలు జరుగుతున్న సమయంలో ఏ ఇద్దరు మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు కలిసినా పెరగబోయే స్థానాలు, మహిళా రిజర్వేషన్? కింద దక్కబోయే సీట్లపైనే చర్చించుకుంటున్నారు.నియోజకవర్గాల పునర్విభజనతో రాష్ట్రంలో ఇప్పుడున్న 119 అసెంబ్లీ సీట్లు 179కి పెరగనున్నాయి. 33 శాతం విమెన్ ?రిజర్వేషన్ అమలైతే తెలంగాణలో వారికి ఏకంగా 59 సీట్లు దక్కనున్నాయి. మహిళలకు ఇంత పెద్ద సంఖ్యలో అసెంబ్లీ సీట్లు రిజర్వుకానుండడంతో పలువురు ప్రజాప్రతినిధులు, నేతలు తమ కుటుంబాల్లోని మహిళలకు రెండో సీటుపై ఇప్పటి నుంచే కన్నేస్తున్నారు. ఆ దిశగా భార్య, కూతు రు, కోడలుతో రాజకీయ పరిచయ కార్యక్రమం చేయిస్తున్నారు. పండుగలు, పబ్బాలు, ఇతర శు భ కార్యాలను పురస్కరించుకొని ఆయా నియోజకవర్గాల్లో ప్రజలకు శు భాకాంక్షలు చెపుతూ ఫ్లెక్సీలు, హోర్డింగ్?లు, కటౌట్లు ఏర్పాటు చేస్తున్నారు. దీంతో వీటిపై జనాల్లో ఆసక్తికర చర్చ సాగుతోంది. ప్రస్తుత అంచనాల ప్రకారం, ఆంధ్రప్రదేశ్‌లో అసెంబ్లీ సీట్లు 50 శాతం పెరిగితే అందులో సుమారు 80 స్థానాలు మహిళలకే కేటాయించాల్సి ఉంటుంది. అలాగే తెలంగాణలో 60 స్థానాలు మహిళలకు రిజర్వ్ అవుతాయి. అంటే రెండు రాష్ట్రాల్లో కలిపి సుమారు 140 మందికి పైగా మహిళా ఎమ్మెల్యేలు చట్టసభల్లో అడుగుపెట్టబోతున్నారు. గతంలో కేవలం 10 నుంచి 15 శాతం లోపే ఉన్న మహిళా ప్రాతినిధ్యం, ఇప్పుడు ఏకంగా 33 శాతానికి పెరగడం రాజకీయ ముఖచిత్రాన్ని పూర్తిగా మార్చేయనుంది.గతంలో స్థానిక సంస్థల ఎన్నికల్లో మహిళలకు రిజర్వేషన్లు ఉన్నప్పటికీ, చాలా చోట్ల భర్తలు లేదా కుటుంబ సభ్యులు ప్రాక్సీ లుగా పాలన సాగించేవారు. కానీ, అసెంబ్లీ స్థాయికి వచ్చేసరికి పరిస్థితి భిన్నంగా ఉండబోతోంది. ప్రస్తుతం సోషల్ మీడియా వాడకం, పెరిగిన విద్యావంతుల సంఖ్య, మహిళల్లో వచ్చిన రాజకీయ చైతన్యంతో సొంతంగా ఎదిగే నేతలకే ప్రాధాన్యత పెరగనుంది. పార్టీలు కూడా కేవలం డమ్మీ అభ్యర్థులను కాకుండా, ప్రజల్లో పట్టున్న, సొంతంగా గెలవగల సామర్థ్యం ఉన్న మహిళా నేతలకే టికెట్లు ఇచ్చే అవకాశం ఉంది.ఇప్పటికే తెలుగు రాష్ట్రాల్లోని ప్రధాన పార్టీలైన టీడీపీ, వైఎస్సార్‌సీపీ, జనసేన, బీఆర్ఎస్, కాంగ్రెస్ , బీజేపీలలో ద్వితీయ శ్రేణి మహిళా నాయకత్వం బలంగా ఉంది. నియోజకవర్గాల్లో పార్టీ కార్యకలాపాలు నిర్వహించడం, ప్రజా సమస్యలపై గళం విప్పడం వంటి పనుల్లో మహిళలు చురుగ్గా పాల్గొంటున్నారు. రాబోయే ఎన్నికల్లో రిజర్వేషన్లు ఖచ్చితం కావడంతో, ఇప్పటి వరకు తెర వెనుక ఉండి పనిచేసిన మహిళా నేతలు ఇప్పుడు నేరుగా ప్రజల ముందుకు వచ్చి తమ నాయకత్వ లక్షణాలను నిరూపించుకోవడానికి సిద్ధమవుతున్నారు. ఇది రాజకీయాల్లో ఒక రకమైన వడపోత కు దారితీసి, అసలైన సమర్థులైన మహిళా నేతలను బయటకు తీస్తుంది.మహిళా రిజర్వేషన్ల వల్ల కేవలం లింగపరమైన ప్రాతినిధ్యమే కాకుండా, సామాజిక సమీకరణాలు కూడా మారుతాయి. రిజర్వ్‌డ్ నియోజకవర్గాల్లో మహిళా నేతల ఎంపిక కోసం పార్టీలు కొత్త వ్యూహాలను రచించాల్సి ఉంటుంది. మహిళా ఓటర్లు అత్యధికంగా ఉన్న తెలుగు రాష్ట్రాల్లో, ఒక మహిళా నేత ఎన్నికల బరిలో ఉంటే మహిళా ఓటింగ్ శాతం పెరగడమే కాకుండా, విద్య, ఆరోగ్యం, తాగునీరు వంటి మౌలిక సమస్యలపై చర్చ ఎక్కువగా జరుగుతుంది. ఇది రాజకీయాల్లో క్వాలిటీ ని పెంచుతుందనడంలో సందేహం లేదు. తెలుగు రాష్ట్రాల్లో మహిళా నేతలకు రాబోయే ఐదేళ్లు అత్యంత కీలకం. అవకాశాల కోసం ఎదురుచూసే దశ నుంచి, అవకాశాలను శాసించే దశకు వారు చేరుకోబోతున్నారు. పార్టీలు కూడా తమ గెలుపు గుర్రాలను వెతుక్కునే క్రమంలో మహిళా అనుబంధ విభాగాలను బలోపేతం చేస్తున్నాయి. చట్టసభల్లో మహిళల భాగస్వామ్యం పెరగడం వల్ల పాలనలో మానవత్వం, పారదర్శకత పెరుగుతాయని విశ్లేషకులు భావిస్తున్నారు. ఈ మార్పు కేవలం రాజకీయాలకే పరిమితం కాకుండా, సమాజంలోని అన్ని రంగాల్లో మహిళల సాధికారతకు బాటలు వేయనుంది.

## రాంచరణ్‌కు పవన్ విషెస్

**విజయవాడ,**ప్రముఖ యువ కథానాయకుడు, గ్లోబల్ స్టార్ రామ్ చరణ్‌కు ఆయన బాబాయ్, జనసేన అధినేత, ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు పవన్ ఓ ప్రకటన విడుదల చేశారు. నటన పట్ల రామ్ చరణ్‌కు ఉన్న అంకితభావాన్ని కొనియాడారు. ప్రతి చిత్రాన్ని తపనతో చేస్తాడని ప్రశంసించారు. "హ్యాపీ బర్త్ డే రామ్ చరణ్! ప్రముఖ యువ కథానాయకుడు రామ్ చరణ్ కు హృదయపూర్వక జన్మదిన శు భాకాంక్షలు. నటన పట్ల అంకిత భావం కలిగిన రామ్ చరణ్ ప్రతి చిత్రాన్ని తపనతో చేస్తాడు. కుటుంబ బంధాలకు విలువనిస్తూ పెద్దల పట్ల గౌరవం కనబరుస్తూ, సహచర నటులు, సాంకేతిక నిపుణులు, దర్శకులు, రచయితలతో మర్యాదగా మెలుగుతాడు. ఆధ్యాత్మిక చింతన మెండుగా ఉంది. ఇవే రామ్ చరణ్ కు ఎల్లవేళలా శ్రీరామరక్ష. రామ్ చరణ్ కు మరిన్ని విజయాలు, సంపూర్ణ ఆనందాన్ని ఇవ్వాలని భగవంతుణ్ణి ప్రార్థిస్తున్నాను" అంటూ పవన్ తన ప్రకటనలో పేర్కొన్నారు.

## కసిరెడ్డి ఆస్తులు జప్తు

**విజయవాడ** ఏపీలో సంచలనం సృష్టించిన మద్యం కుంభకోణం కేసులో ప్రధాన నిందితుడు రాజ్ కేసిరెడ్డి చుట్టూ ఉచ్చు మరింత బిగుస్తోంది. మద్యం స్కామ్ ద్వారా వచ్చిన ముడుపులతో రాజ్ కేసిరెడ్డి తన తల్లిదండ్రుల పేరిట తెలంగాణలోని జనగామ, షాబాద్ ప్రాంతాల్లో భారీగా భూములు కొనుగోలు చేసినట్లు సిట్ గుర్తించింది. ముఖ్యంగా షాబాద్‌లో తన తల్లి కేసిరెడ్డి సుభాషిణి పేరుతో కొన్న 17.60 ఎకరాల భూమి అసలు మార్కెట్ విలువ దాదాపు రూ. 70 కోట్లు కాగా, రిజిస్ట్రేషన్ సమయంలో కేవలం రూ. 2.69 కోట్లుగా చూపించారు. అలాగే జనగామలో తండ్రి ఉపేంద్ర రెడ్డి పేరుతో లక్షల విలువైన ప్లాట్లు ఉన్నట్లు గుర్తించారు. ఈ బినామీ ఆస్తులన్నింటినీ జప్తు చేసేందుకు విజయవాడలోని ఏసీబీ కోర్టులో పిటిషన్ దాఖలు చేసేందుకు సిట్ సిద్ధమైంది. ఇప్పటికే ఈ కేసులో రాజ్ కేసిరెడ్డికి సంబంధించి వందల కోట్ల విలువైన ఆస్తులను ఈడీ, సిట్ అటాచ్ చేసిన సంగతి తెలిసిందే. ఇప్పుడు కొత్తగా గుర్తించిన రూ. 70 కోట్లకు పైగా విలువైన ఆస్తులను జప్తు చేసేందుకు విజయవాడలోని ఏసీబీ కోర్టులో పిటిషన్ వేయాలని సిట్ నిర్ణయించింది. దీనికోసం అనుమతిని కోరగా... ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది.

## ఘనంగా రాములోరి కళ్యాణం...

**ఖమ్మం,**శ్రీరామనవమి పర్వదినాన్ని పురస్కరించుకుని భద్రాచలంలో జరిగిన సీతారాముల కళ్యాణ మహోత్సవం వైభవంగా జరిగింది. ఈ వేడుకకు సీఎం రేవంత్ రెడ్డి సతీసమేతంగా హాజరయ్యారు. సంప్రదాయం ప్రకారం స్వామివారికి పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించారు. ఇదే సందర్భంగా ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న భద్రాద్రి ఆలయ అభివృద్ధి పనులకు ఆయన శంకుస్థాపన చేశారు.శ్రీరామనవమి నాడు పాలకులు స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పించడం గోల్కొండ నవాబుల కాలం నుంచి వస్తున్న ఆనవాయితీ. ఈ సంప్రదాయాన్ని గౌరవిస్తూ సీఎం రేవంత్ రెడ్డి తన అర్ధాంగితో కలిసి స్వామివారికి వస్త్రాలు అందజేశారు. తెలంగాణ సీఎంగా బాధ్యతలు చేపట్టాక, భద్రాద్రి రాముడిపై తన భక్తిని చాటుకుంటూ ఆలయ అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తున్నారు.భద్రాచలం ఆలయాన్ని మూడు దశల్లో విస్తరించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకోసం మొత్తం రూ.586 కోట్లతో ప్రణాళికలు సిద్ధం చేశారు. ఇందులో భాగంగా తొలి దశలో రూ. 351 కోట్లతో చేపట్టనున్న పనులకు ముఖ్యమంత్రి శ్రీరామనవమి రోజునే భూమిపూజ చేసి శ్రీకారం చుట్టారు.

## స్లో పాయిజన్‌తో చంపేస్తున్నారు

**హైదరాబాద్** హైదరాబాద్ నగరవాసుల ప్లేట్లలోకి చేరుతున్న ఆహారం స్వచ్ఛమైనది కాదు. ఓ పక్కదంలో కల్తీ మాఫియా ప్రజలకు విషాన్ని పంచుతోంది. గత కొన్ని రోజులుగా తెలంగాణ ఫుడ్ సేఫ్టీ టాస్క్ ఫోర్స్ , పోలీసులు జరుపుతున్న ఆకస్మిక దాడులు సామాన్యులను గ్భ్రాంతికి గురిచేస్తున్నాయి. బ్రాండెడ్ అవుట్‌లెట్ల నుంచి గల్లీలోని బేకరీల వరకు.. అన్నీ కల్తీ మయం అనే నిజం వెలుగు చూస్తోంది.హైదరాబాద్‌లోని కాటేదాన్, ముషీరాబాద్, బేగంబజార్ వంటి ప్రాంతాల్లో ఇటీవల జరిగిన దాడులు ఆహార రంగంలోని చీకటి కోణాన్ని బయటపెట్టాయి. మురికిపోయిన కోడిగుడ్లతో కేకులు, డోనట్లు తయారు చేయడం.. నాసిరకం కొబ్బరి పొడిని బ్రాండెడ్ ప్యాకెట్లలో నింపి విక్రయించడం వంటి దారుణాలు వెలుగులోకి వచ్చాయి. కేవలం చిన్న హోటళ్లే కాదు, హల్దీరామ్ వంటి పేరున్న బ్రాండెడ్ అవుట్‌లెట్లలో కూడా గడువు తీరిన స్వీట్లు, బూజు పట్టిన పదార్థాలు విక్రయిస్తుండటం పౌర సమాజాన్ని విస్మయానికి గురిచేస్తోంది. టీ పౌడర్‌లో రంగులు, కొబ్బరి పీచు కలపడం.. కుళ్ళిన మాంసాన్ని ఐస్ పెట్టి నిల్వ ఉంచి హోటళ్లకు సరఫరా చేయడం వంటివి చూస్తుంటే మనం తింటున్నది ఆహారమా లేక విషమా అన్న అనుమానం కలుగుతోంది.ఎఫ్ఎస్ఎస్ఏఐ నిబంధనలు కాగితాలకే పరిమితం కావడంతో, కల్తీ రాయుళ్లు బరితెగిస్తున్నారు. కనీస లైసెన్సులు లేని యూనిట్లు యథేచ్ఛగా నడుస్తున్నాయి. అధికారులు దాడులు చేసినప్పుడు మాత్రమే హడావిడి కనిపిస్తోంది కానీ, ఆ తర్వాత మళ్లీ పరిస్థితి మొదటికే వస్తోంది. కల్తీ టీ పొడి, కుళ్ళిన గుడ్లు, రసాయనాలు కలిపిన ఆహారం తీసుకోవడం వల్ల ప్రజలు దీర్ఘకాలిక అనారోగ్యాల బారిన పడుతున్నారు. ముఖ్యంగా చిన్న పిల్లలు బేకరీ ఐటమ్స్ తిని ఫుడ్ పాయిజనింగ్‌కు గురవుతున్నారు. సోడియం బెంజోయేట్, సింథటిక్ రంగుల వంటి ప్రమాదకర రసాయనాల వాడకం క్యాన్సర్ వంటి వ్యాధులకు దారితీస్తోంది. పండుగల సమయాల్లో ఈ కల్తీ మాఫియా మరింతగా విజృంభిస్తోంది.కల్తీ చేసే వారికి కేవలం జరిమానాలు విధిస్తే సరిపోదు. ప్రజల ప్రాణాలతో చెలగాటమాడే వారిపై హత్యా యత్నం కేసులు నమోదు చేయాలని నగర పోలీస్ కమిషనర్ సజ్జనార్ వంటి అధికారులు ఇప్పటికే హెచ్చరించారు. వారు చేస్తున్నది కూడా అదే. నమ్మి కొనుగోలు చేసి తింటోంది ఆహారం కాదు..స్లోపాయిజన్ అని తెలిసే సరికి మొత్తం నష్టం జరిగిపోతుంది. ఆరోగ్యం పాడవుతుంది. అటువంటి అవుట్‌లెట్లను శాశ్వతంగా మూసివేసి, వారి ట్రేడ్ లైసెన్సులను రద్దు చేయాలి. ఆహార భద్రత విషయంలో రాజీ పడితే, అది భావి తరాల ఆరోగ్యాన్ని పణంగా పెట్టడమే అవుతుంది.

### శ్రీరామ నవమి వేడుకలలో

## పాల్గొన్న బిజెపి నాయకులు

- ఘనంగా స్వాగతం పలికిన నియోజకవర్గ బిజెపి నాయకులు నవీన్ రెడ్డి.
- సీతారామ దేవాలయం నందు ప్రత్యేక పూజలు నిర్వహణ.



**తుగ్గలి:** మండల కేంద్రమైన తుగ్గలి నందు శుక్రవారం రోజున ఘనంగా నిర్వహించిన శ్రీరామనవమి వేడుకలకు వివిధ నియోజకవర్గాల నుండి బిజెపి నాయకులు పాల్గొన్నారు.శ్రీరామనవమి వేడుకలకు విచ్చేసిన బిజెపి నాయకులకు పత్తికొండ నియోజకవర్గం బిజెపి నాయకులు తుగ్గలి నవీన్ రెడ్డి బాణాసంచాలు పేలుస్తూ శాలువాను కప్పి ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా శ్రీరామనవమి వేడుకలకు విచ్చేసిన బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షులు సునీల్ రెడ్డి,ఆలూరు మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ గుమ్మనూరు నారాయణ, మాజీ ఎమ్మెల్యే మురళీకృష్ణ,కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షులు బసవరాజు లతో కలసి తుగ్గలి నవీన్ రెడ్డి లు సీతారాముల దేవాలయం నందు ప్రత్యేక పూజలను నిర్వహించారు.

అనంతరం పత్తికొండ నియోజకవర్గం బిజెపి నాయకులు నవీన్ రెడ్డి మాట్లాడుతూ ప్రతి ఏటా గ్రామం నందు శ్రీరామనవమి కళ్యాణ వేడుకలను మరియు సీతారాముల రథోత్సవ వేడుకలను గ్రామ ప్రజల మరియు పెద్దల సహకారంతో ఈ వేడుకలను ఘనంగా నిర్వహిస్తామని,శ్రీ రామనవమి వేడుకలకు విచ్చేసిన బిజెపి నాయకులకు ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో తుగ్గలి మండలం బిజెపి అధ్యక్షులు లక్ష్మన్న,మద్దికేర మండల అధ్యక్షులు శంకర్ బాబు,మాజీ మండల అధ్యక్షులు లక్ష్మణ స్వామి,పత్తికొండ నియోజకవర్గం బిజెపి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## గత ఐదేళ్లలో ఏపిలో నమోదైన ఫోక్సో, ఎఫ్.టి.ఎస్.సి.కేసుల వివరాలను తెలియజేయండి

- లోక్ సభలో భారత ప్రభుత్వాన్ని కోరిన చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు
- సానుకూలంగా స్పందించిన కేంద్ర చట్టం, న్యాయ శాఖ మంత్రిత్వశాఖ
- లిఖితపూర్వక సమాధానమిచ్చిన కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘువాల్



**చిత్తూరు** గత ఐదేళ్లలో ఆంధ్రప్రదేశ్లో నమోదైన ఫోక్సో,ఎఫ్.టి.ఎస్.సి.కేసుల వివరాలను తెలియజేయాలని భారత ప్రభుత్వాన్ని కోరారు చిత్తూరు పార్లమెంటు సభ్యులు దగ్గుమళ్ళ ప్రసాదరావు. తాను లేవనెత్తిన ప్రశ్నలకు సానుకూలంగా స్పందించిన కేంద్ర చట్టం,న్యాయ ,మంత్రిత్వశాఖామంత్రి, పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘువాల్ లిఖితపూర్వక సమాధానమిచ్చినట్లు తెలిపారు.ఢిల్లీ పార్లమెంటు సమావేశాలకు హాజరైన చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు.., ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు మార్గనిర్దేశంలో పని చేస్తున్నారు.ఆంధ్రప్రదేశ్ హక్కులు, ప్రయోజనాల సాధన కోసం అహర్నిశలు శ్రమిస్తున్నారు. ఇందులో భాగంగా శుక్రవారం ఫోక్సో,ఎఫ్.టి.ఎస్.సి.చట్టాలు, వాటి పనితీరుకు సంబంధించిన వివరాలను తెలియజేయాలని భారత ప్రభుత్వాన్ని కోరారు. వాటిలోని ముఖ్యాంశాలను పరిశీలిస్తే... దేశంలో గత ఐదేళ్లలో రాష్ట్రాల వారీగా నమోదైన పోక్సో కేసుల సంఖ్య ఎంత..? పూర్తయిన పోక్సో కేసుల సంఖ్య..? ఎఫ్ టి ఎస్ సి పథకం క్రింద దేశంలో మొత్తం ఎన్ని ఫాస్ట్ ట్రాక్ స్పెషల్ కోర్టులు (ఎఫ్ టి ఎస్ సి) ఏర్పాటు చేయబడ్డాయి, ప్రస్తుతం ఎన్ని కోర్టులు పనిచేస్తున్నాయి..? ఎఫ్ టి ఎస్ సి పథకం క్రింద ప్రారంభం నుండి రాష్ట్రాల వారీగా కేటాయించిన, విడుదల చేసిన వినియోగించిన నిధుల వివరాలు? ఆంధ్రప్రదేశ్‌లో ఏర్పాటు చేసిన ఎఫ్ టి ఎస్ సి ల వివరాలు, గత ఐదేళ్లలో ప్రతి ఎఫ్ టి ఎస్ సి కి విడుదల చేసిన నిధుల మొత్తం, ప్రతి కోర్టు పూర్తి చేసిన పోక్సో కేసుల సంఖ్య ఎంత ..? అన్న అంశాలకు సంబంధించిన వివరాలను తెలియజేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరగా.., తక్షణం స్పందించిన కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘువాల్..,లిఖిత పూర్వకంగా సమాధానం ఇచ్చినట్లు చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు తెలిపారు.న్యాయస్థానాలం అందజేసిన సమాచారం ప్రకారం, 2026 జనవరి నాటికి,29రాష్ట్రాలు,కేంద్రపాలిత ప్రాంతాల్లో 774 ఎఫ్ టి ఎస్ సి లు, 398 ఎక్స్‌క్లూజివ్ పోక్సో (ఇ–పోక్సో) కోర్టులు పనిచేస్తున్నాయని తెలియజేశారు. ఎఫ్ టి ఎస్ సి స్కీమ్ క్రింద ఎక్స్‌క్లూజివ్ పోక్సో కోర్టులతో సహా ఫాస్ట్ ట్రాక్ స్పెషల్ కోర్టులు (ఎఫ్ టి ఎస్ సి) లు నమోదు చేసిన, పూర్తి చేసిన కేసుల సంఖ్య– 11,790 5,725.. గా పేర్కొన్నారు

## ఘనంగా శ్రీరామనవమి వేడుకలు.



**శిరివెళ్ల** సీతారాముల కల్యాణ సందర్భంగా పట్టు వస్త్రాలు సమర్పించిన దానధర్మ చారిటబుల్ ట్రస్ట్ జిల్లా అధ్యక్షులు అన్నెం నాగమల్లేశ్వరరెడ్డి దంపతులు.శ్రీరామ నవమి వేడుకలలో భాగంగా పలు క్రీడా పోటీలు నిర్వహిస్తున్న నాగమల్లేశ్వరరెడ్డి. శిరివెళ్ల : శ్రీరామనవమి పండుగ సందర్భంగా వేద సంకల్ప సేవ ట్రస్ట్ మరియు దానధర్మ ట్రస్ట్ ఆధ్వర్యంలో సంయుక్తంగా నిర్వహిస్తున్న శ్రీరామనవమి వేడుకల సంబరాలు.యాల్లూరు గ్రామంలోని ఎస్సీ కాలనీలో గల రామాలయం నందు శ్రీరామనవమి వేడుకలు అంగరంగ వైభవంగా నిర్వహించడం జరిగిందని దానధర్మ చారిటబుల్ ట్రస్ట్ నంద్యాల జిల్లా అధ్యక్షుడు నాగమల్లేశ్వరరెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేద సంకల్ప సేవా ట్రస్ట్ మరియు దానధర్మ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శ్రీ సీతారాముల వారికి పట్టు వస్త్రాలు సమర్పించి ముత్యాల తలంబ్రాలతో కళ్యాణ వేడుకలను వేద పండితుల మంత్ర చరణల మధ్య ఘనంగా నిర్వహించడం జరిగిందని రామనామ స్మరణతో మనసు ప్రశాంతత సకల శుభాలు కలుగుతాయని శ్రీరామ జయరామ జయజయ రామ వంటి మంత్రాలను జపించడం చాలా మంచిదని పానకం వడపప్పు శ్రీరామునికి నైవేద్యంగా సమర్పిస్తారని ఇది ఆరోగ్యపరంగా ఆధ్యాత్మికంగా కూడా విశేషమైనదని వారు తెలియజేశారు. మారుమూల పల్లెల్లో రామాలయాలలో శ్రీరామనవమి పండుగ నిర్వహించలేని పరిస్థితిని దృష్టిలో ఉంచుకొని ఈ యొక్క కార్యక్రమాన్ని యాలూరు గ్రామంలోని ఎస్సీ కాలనీలో శ్రీరామనవమి వేడుకల సందర్భంగా సీతారాముల కళ్యాణం అత్యంత వైభవంగా నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలంగాణలోని మరియు ఆంధ్రప్రదేశ్ 73 కు పైగా దేవాలయాలలో మరియు నంద్యాల నియోజకవర్గంలోని గోస్పాడు మండల పరిధిలోని యాలూరు గ్రామంలో గల రామాలయంలో సీతారామ కళ్యాణం మరియు శ్రీరామనవమి ఉత్సవాలు నిర్వహించేందుకు వేద సంకల్ప ట్రస్ట్ వారు సహాయం అందించారని వారు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఐదు మంది దంపతులు కళ్యాణంలో పాల్గొన్నారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. అక్కడికి వచ్చినటువంటి భక్తులకు కళ్యాణం అనంతరం తీర్థ ప్రసాదములతో పాటు ఉచిత అన్నదాన కార్యక్రమం నిర్వహించడం జరిగిందన్నారు.

## విశాఖలో వైభవంగా రాములోరి కళ్యాణం

**విశాఖపట్నం** విశాఖలో శ్రీ సీతారాముల కల్యాణ మహోత్సవం అత్యంత వైభవంగా జరిగింది. వేద మంత్రోచ్చారణలు, మంగళ వాయిద్యాల నడుమ కన్నుల పండువగా సాగిన ఈ దివ్య కల్యాణాన్ని వీక్షించేందుకు ప్రాంతాల నుంచి భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. భక్తిశ్రద్ధలతో సాగిన ఈ వేడుకలో పాల్గొన్న భక్తులందరూ ఒకచోట చేరి స్వామివారి తీర్థప్రసాదాలు స్వీకరించి ఆశీస్సులు అందుకున్నారు. విశేష ఆధ్యాత్మిక శోభతో విలసిల్లిన ఈ కల్యాణ కార్యక్రమంతో ప్రాంగణంలో పూర్తిగా పండుగ వాతావరణం నెలకొంది.ఈ కార్యక్రమంలో పలువురు వైసీపీ జిల్లా అద్యక్షులు కేకే రాజు పాల్గోన్నారు.

### కొలిమిగుండ్ల ఆర్టీసీ బస్టాండ్‌లో

## చలివేంద్రం ప్రారంభం




**కొలిమిగుండ్ల** కొలిమిగుండ్ల మండల కేంద్రంలోని స్థానిక బస్టాండులో రోడ్ల భవనాల శాఖ మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి గారి సూచనల మేరకు టిడిపి మండల అధ్యక్షుడు మూలే రామేశ్వర్ రెడ్డి సహాయ సహకారాలతో ఆర్టీసీ అధికారుల అభ్యర్థనల మేరకు ఆర్టీసీ బస్టాండ్ లో ఏర్పాటుచేసిన చలివేంద్రాన్ని సూపర్డెంట్ వెంకటన్న ఘనంగా ప్రారంభించారు. స్థానిక తహసిల్దార్ కార్యాలయం వద్ద కూడా శుక్రవారం నూతనంగా ఏర్పాటుచేసిన చలివేంద్రాన్ని స్థానిక టిడిపి నాయకులు ఘనంగా ప్రారంభించారు. వేసవికాలంలో ప్రయాణికులు మరియు ప్రజల దాహార్తిని తీర్చడానికి ఈ చలివేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు లోకేపల్లి మధు ప్రసాద్ రెడ్డి తెలిపారు. శ్రీరామనవమి పండగ సందర్భంగా ప్రయాణికులకు మరియు గ్రామ ప్రజలకు ఉచితంగా మజ్జిగ పంపిణీ చేసినట్లు స్థానిక టిడిపి నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలోలోకేపల్లి మధు ప్రసాద్ రెడ్డి, గూలి రామచంద్రారెడ్డి, రవికుమార్, ఉలవల ప్రసాద్, చంద్ర, నాగేశ్వరరావు, నరసింహుడు, దస్తగిరి ఇంకా తదితర టీడీపీ నాయకులు కార్యకర్తలు గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

తెలుగు దినపత్రిక https://aksharagalam.com
అక్షరగళం
ప్రతి అక్షరం ప్రజల కోసం
శనివారం, మార్చి 28, 2026

## శ్రీ కోదండరామాలయంలో
# ఘనంగా శ్రీరామనవమి వేడుకలు

**తిరుపతి** తిరుపతి శ్రీ కోదండరామస్వామివారి ఆలయంలో శుక్రవారం శ్రీరామనవమి వేడుకలు ఘనంగా జరిగాయి.తెల్లవారుజామున సుప్రభాతంతో స్వామివారిని మేల్కొలిపి ఉదయం మూలవర్లకు అభిషేకం చేశారు. ఉదయం 8 నుండి 9 గంటల వరకు ఊంజల్ మండపంలో శ్రీ సీతారామ లక్ష్మణ సమేత హనుమంతులవారి ఉత్సవర్లకు స్నపన తిరుమంజనం వైభవంగా నిర్వహించారు. ఇందులో పాలు, పెరుగు, తేనె, కొబ్బరినీళ్లు, పసుపు, చందనంతో అభిషేకం చేశారు.సాయంత్రం 3 నుండి 4 గంటల వరకు శ్రీశ్రీశ్రీ పెద్దజీయర్‌స్వామివారి మఠం నుండి అర్చకులు నూతన వస్త్రాలను తీసుకొని విమాన ప్రదక్షిణగా వచ్చి స్వామివారి మూలవర్లకు, ఉత్సవర్లకు సమర్పించారు. ఆ తరువాత శ్రీరామ జన్మపురాణం, ఆస్థానం నిర్వహించారు.రాత్రి 7 నుండి 9 గంటల వరకు శ్రీరామచంద్రమూర్తి తన ప్రియభక్తుడైన హనుమంత వాహనాన్ని అధిష్టించి ఆలయ నాలుగు మాడ వీధుల్లో విహరించి భక్తులను కటాక్షిస్తారు.

# సమృద్ధిగా వర్షాలు పడాలి పంటలు పండాలి

**- ప్రజలందరూ సుఖశాంతులతో ఉండాలి**

**- మంత్రి పొన్నం ప్రభాకర్**



**వేములవాడ** శ్రీ సీతారాముల కల్యాణానికి రాష్ట్ర ప్రభుత్వం తరపున పట్టువస్త్రాలు, తలంబ్రాలు వేములవాడలో అందజేత.శ్రీ సీతారాముల ఆశీస్సులతో రాష్ట్రంలో సమృద్ధిగా వర్షాలు పడాలి, పంటలు పండాలని రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆకాంక్షించారు. శ్రీ రామ నవమి సందర్భంగా వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయం వద్ద ఉన్న శివార్చన స్టేజి వద్ద శ్రీ సీతారాముల కల్యాణానికి రాష్ట్ర ప్రభుత్వం తరపున పట్టువస్త్రాలు, తలంబ్రాలు మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ సమర్పించారు. ఈ సందర్భంగా రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ. శ్రీ సీతారాముల కల్యాణానికి రాష్ట్ర ప్రభుత్వం తరపున పట్టువస్త్రాలు, తలంబ్రాలు సమర్పించామని తెలిపారు. శ్రీ సీతారాముల ఆశీస్సులతో రాష్ట్రంలో వర్షాలు సమృద్ధిగా కురవాలని, పంటలు బాగా పండాలని ఆకాంక్షించారు. ప్రజలందరూ సుఖశాంతులతో ఉండాలన్నారు. వైభవంగా శ్రీ సీతారాముల కల్యాణం: ప్రభుత్వ విప్‌వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయం వద్ద ఉన్న శివార్చన స్టేజీ వద్ద శ్రీ సీతారాముల కల్యాణం వైభవంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ తెలిపారు. శ్రీ భీమేశ్వర స్వామి ఆలయంలో ఆయన మాట్లాడుతూ. వేములవాడలో శ్రీ సీతారాముల కల్యాణం సంప్రదాయంగా వస్తుందని వివరించారు. కల్యాణానికి 50వేల భక్తులు వస్తారనే అంచనా మేరకు అన్ని ఏర్పాట్లు చేశామని వెల్లడించారు. పందిళ్లు, ఇతర సౌకర్యాలు ఏర్పాటు చేయించామని పేర్కొన్నారు. నూతన వేదిక వద్ద శ్రీ శివ, శ్రీ సీతారాముల కల్యాణం వేడుకలు దేవాదాయ శాఖ ఆద్వర్యంలో నిర్వహిస్తున్నామని తెలిపారు.సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమ పథకాలు విజయవంతంగా అమలు అవుతున్నాయని వివరించారు. శ్రీ సీతారాముల ఆశీస్సులు రాష్ట్ర ప్రభుత్వం, ప్రజలపై ఉండాలని ఆకాంక్షించారు.

# తాడిపత్రిలో కాల్పుల కలకలం



**తాడిపత్రి** ఏడేళ్ల బాలుడిని దారుణంగా చంపిన సర్వేష్పై పోలీసులు ఆరు రౌండ్లు కాల్పులు జరిపారు. కోన ఉప్పలపాడులో ఏడేళ్ల బాలుడు హేమచంద్రను డబ్బు కోసం కిడ్నాప్ చేసి సర్వేష్ హత్య చేసిన విషయం తెలిసిందే. పోలీసులు నిందితుడు సర్వేష్ను అదుపులోకి తీసుకున్నారు. సీన్ రీకన్ స్ట్రక్షన్ చేస్తుండగా నిందితుడు సర్వేష్ పారిపోయేందుకు యత్నం చేసాడు. సీఐ రామసుబ్బయ్య, మరో కానిస్టేబుల్పై బీరు బాటిల్తో దాడి చేశాడని పోలీసులు అంటున్నారు. ఆత్మరక్షణ కోసం సర్వేష్పై ఆరు రౌండ్ల కాల్పులు జరిపామని అంటున్నారు. ఇందులో నాలుగు రౌండ్లు గాలిలోకి రెండు రౌండ్లు మోకాళ్ళ కిందకు కాల్చారు.

ఘటనలో సిఐ రామసుబ్బయ్య, మరో కానిస్టేబుల్ వెంకటేష్ నాయక్ కు గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం పోలీసులు, నిందితుడు తాడిపత్రి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. గాయపడిన సీఐ, కానిస్టేబుల్ను ఎస్పీ, అడిషనల్ ఎస్పీ రోహిత్ చౌదరీపరామర్శించారు.

## కడప టీడీపీలో మొదలైన
# ఆధిపత్య పోరు


**- దాడులకు దారితీస్తున్న డివిజన్ ఇంచార్జి వ్యవహారం**

**కడప** కడప తెలుగు దేశం పార్టీలో ఆధిపత్య పోరు శృతి మించుతోంది. తాజాగా పరస్పర దాడులకు దారితీసింది. 4వ డివిజన్ పరిధిలో పాత టీడీపీ నేతలకి, వైసీపీ నుంచి వచ్చిన వలస నేతల వర్గాల మధ్య ఘర్షణ చెలరేగింది.

కర్రలతో దాడులు జరిగాయి. ఘటనలో టీడీపీ డివిజన్ ఇంచార్జి ఆవుల వెంకటేష్కు తీవ్ర గాయాలు అయ్యాయి. మూకుమ్మడిగా 20 మందిగా దాడి చేసినట్లు వెంకటేష్ అరోపణ. ఇటీవల వైసీపీని వీడి టీడీపీలో ఒర్సు బాలకొండయ్య చెరాడు.

ఎమ్మెల్యే మాధవి రెడ్డి సమక్షంలో బాలకొండయ్య పార్టీ కండువా కప్పుకున్నాడు. అప్పటి నుంచి పాత నేతల మధ్య ఆధిపత్య పోరు ముదిరింది. మాట్లాడాలని పిలిచి 20 మంది తనపై కర్రలతో దాడి చేశారని వెంకటేష్ ఆరోపించాడు.

# ఐటి అదుపులో గోల్డ్ మ్యాన్



**రంగారెడ్డి,** శేరిలింగంపల్లికి చెందిన బంగారు బాబు, హోప్ ఫౌండేషన్, తెలంగాణ హాకీ చైర్మన్ కొండ విజయ్ కుమార్ ను ఢిల్లీ ఇన్కమ్ టాక్స్ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. న్యూఢిల్లీలో జరుగుతున్న హాకీ ఇండియా అవార్డుల ప్రధానోత్సవానికి బయలుదేరిన కొండ విజయ్ కుమార్ ను హైదరాబాద్ లోని రాజీవ్ గాంధీ ఇంటర్నేషనల్ ఎయిర్ పోర్టులో గురువారం రాత్రి స్థానిక ఐటీ అధికారులు అడ్డుకొని పాన్ కార్డు స్వాధీనం చేసుకున్నారు. తదనంతరం కొండ విజయ్ కుమార్ న్యూఢిల్లీ ఎయిర్ పోర్టులో దిగగానే అక్కడి ఢిల్లీ ఇన్కమ్ టాక్స్ అధికారులు నలుగురు వారిని అదుపులోకి తీసుకొని ఎయిర్ పోర్టు లోనే విచారణ ప్రారంభించారు.తనఒంటిపైన ఉన్న బంగారం మొత్తాన్ని సీజ్ చేయడంతో పాటు వారి పేరుతో ఉన్న స్థిర, చర ఆస్తుల వివరాలను సేకరించే పనిలో పడ్డారు. 12 గంటల పాటు విచారించిన అధికారులు అవార్డుల ప్రధానోత్సవానికి వెళ్లడానికి అనుమతిని ఇచ్చారు. అనంతరం మళ్లీ వారిని విచారణకు హాజరు కావాల్సిందిగా సూచించినట్లు సమాచారం.

## తూర్పుగోదావరి వ్యాప్తంగా వివిధ పోలీస్ స్టేషన్ల పరిధిలో "పల్లెనిద్ర(గ్రామ, వార్డు)".

**కడియపులంక** తూర్పుగోదావరి జిల్లా ఎస్పీ గారి ఆదేశాల మేరకు "పల్లెనిద్ర((గ్రామ, వార్డు)" చేసి ప్రజలతో మమేకమై వారి సమస్యలను, అక్కడి పరిస్థితులను గురించి తెలుసుకొని, నేరాల నియంత్రణకు తీసుకోవలసిన జాగ్రత్తలపై పోలీసులు అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ…జిల్లా వ్యాప్తంగా ఉన్న గ్రామీణ/ వార్డు ప్రాంత ప్రజల భద్రత, అవగాహన, పోలీసుప్రజల మధ్య స్నేహపూర్వక సంబంధాలను బలోపేతం చేయాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగిందని, గ్రామాలు, వార్డులలో ఏవైనా సమస్యలు ఉంటే పోలీస్ అధికారుల దృష్టికి తీసుకొని రావాలని, ఆ సమస్యల పరిష్కారానికి వేగవంతంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు.ప్రస్తుతం సమాజంలో జరుగుతున్న నేరాలు , నూతన చట్టాలపై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలన్నారు. జిల్లాలో అసాంఘిక కార్యకలాపాలకు పూనుకుంటున్నటు వంటి వారి పట్ల కఠినమైన చర్యలు తీసుకుంటున్నామని, దీనిలో భాగంగా డ్రోన్ కెమెరాలతో ప్రత్యేకంగా నిఘా ఏర్పాటు చేయడం జరిగిందన్నారు.ఈ సందర్భంగా పోలీసు అధికారులు మహిళా భద్రతా విధానాలు, సెల్ఫ్ డిఫెండింగ్ టెక్నిక్స్, సైబర్ నేరాలు, లోన్ యాప్లు, ట్రాఫిక్ నియమాలు, సోషల్ మీడియా మోసాలు, యాంటీ డ్రగ్స్, బాల్య వివాహాలు మరియు శక్తి యాప్ల డౌన్లోడ్ల గురించి అవగాహన కలిగించారు. అదేవిధంగా గ్రామాల్లో సీసీ కెమెరాల ఏర్పాటు వల్ల నేరాల నియంత్రణ, ఆధారాల సేకరణలో కలిగే ప్రయోజనాలను వివరించారు. గత రాత్రి కడియం పోలీస్ స్టేషన్ పరిధిలోని కడియపులంక గ్రామం, కొవ్వూరు టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో, ఉండ్రాజవారం పోలీస్ స్టేషన్ పరిధిలోని చిలకపాడు గ్రామం నందు పల్లెనిద్ర((గ్రామ, వార్డు) కార్యక్రమం నిర్వహించారు.

# లాక్ డౌన్ లేదు



**న్యూఢిల్లీ** లాక్డౌన్ ఊహాగానాల నేపథ్యంలో కేంద్ర మంత్రి హర్దీప్సింగ్ పురీ స్పష్టత నిచ్చారు. లాక్డౌన్పై వినిపిస్తోన్న వదంతులు పూర్తిగా అవాస్తవమని.. లాక్డౌన్ ప్రతిపాదనేదీ కేంద్ర ప్రభుత్వం వద్ద లేదని వివరణ ఇచ్చారు. క్లిష్ట సమయంలో మనమంతా ఐక్యంగా ఉండాలి.. వదంతులు సమాజానికి హాని చేస్తాయి. దేశ ఇంధన సరఫరాకు అంతరాయం కలగకుండా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని అన్నారు. సవాళ్లను ఎదుర్కొనేందుకు కేంద్రం సిద్ధంగా ఉందని అన్నారు.

## బాలాజీ గ్యాస్ కంపెనీ వద్ద
# వినియోగదారుల ఆందోళన

**తాడేపల్లి** బాలాజీ గ్యాస్ కంపెనీ వద్ద వినియోగదారులు ఆందోళనకు దిగారు. మహిళలు డెలివరీ ఆటోలను కంపెనీ నుంచి బైటకు వెళ్లకుండా అడ్డుకున్నారు. 20 రోజుల క్రితం బుక్ చేసుకొని ఓటిపి లు వచ్చినా… ఇంతవరకు గ్యాస్ సిలిండర్ లు డెలివరీ చేయలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సిలిండర్ కోసం కంపెనీ కి వస్తే…ఇక్కడికి వచ్చిన వారిని వదిలేసి…బైటకు ఎలా సిలిండర్ లు పంపిస్తారని కంపెనీ ప్రతినిధులను నిలదీసారు. బైట డొమెస్టిక్ గ్యాస్ సిలిండర్లు ను రూ.2 వేల నుండి రూ.3 వేల వరకు అమ్ముకుంటున్నారని ఆరోపించారు.

## శ్రీరామనవమి వేడుకల్లో పాల్గోన్న మంత్రి పొన్నం



**కరీంనగర్ జిల్లా** హుజురాబాద్ నియోజకవర్గం ఇల్లందకుంట లో శ్రీరామనవమి వేడుకలు ఘనంగా జరిగాయి. అంగరంగ వైభవంగా సీతారాముల కల్యాణ వేడుక నిర్వహించారు. శ్రీ సీతారాముల వారి కళ్యాణం సందర్భంగా ఇల్లందుకుంట రామాలయంలో ప్రభుత్వం తరుపున మంత్రి పొన్నం ప్రభాకర్ పట్టువస్త్రాలు సమర్పించారు. పొన్నం సత్తయ్య పేరు మీద ఉచిత మజ్జిగ పంపిణీ కార్యక్రమం ప్రారంభించారు. ఈ ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా, సిపి గౌస్ ఆలం, హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి ఒడితల ప్రణవ్,ఇతర ముఖ్య నేతలు ,అధికారులు పాల్గోన్నారు. ఇల్లందుకుంట శ్రీ సీతారామస్వామి వారి ఆశీస్సులతో రాష్ట్రమంతా సమృద్ధి వర్షాలతో పాడిపంటలతో ప్రజలంతా ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో ఉండాలని స్వామివారిని మంత్రి వేడుకున్నారు.

## గోదావరి తీరాన వెలసి దక్షిణ అయోధ్యగా
# విరాజిల్లుతున్న పవిత్ర క్షేత్రం

**- భక్తి పారవశం, ఆధ్యాత్మికత, సంప్రదాయం,సంస్కృతి కలిసిన మహాసంగమం?**

**- భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి దేవస్థానం**

చారిత్రక భద్రాచలం శ్రీసీతారామచంద్ర స్వామి దేవస్థానాన్ని దక్షిణ అయోధ్యగా తీర్చిదిద్దే సంకల్పంతో ప్రజాప్రభుత్వం దేవాలయ పునరాభివృద్ధి, గోదావరి పుష్కర ఘాట్లు నిర్మాణ పనులకు రూ.351 కోట్లతో శ్రీకారం చుట్టింది. శ్రీరామనవమిని పురస్కరించుకొని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తొలిదశ భూమి పనులకు పూజ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, సహచర మంత్రులు తుమ్మల నాగేశ్వర రావు , కొండా సురేఖ ,రాజ్యసభ సభ్యులు వేం నరేంద్ర రెడ్డి , ఎంపీ బలరాం నాయక్ తదితరులు పాల్గోన్నారు.

51 పోలీసుల అదుపులో బస్సు డ్రైవర్, యజమాని హరికృష్ణ

**ఒంగోలు,**ప్రకాశం జిల్లా మార్కాపురం సమీపంలో జరిగిన ఘోర బస్సు ప్రమాదం తెలుగు రాష్ట్రాలను కలచివేసింది. 14 మంది ప్రాణాలను బలిగొన్న ఈ విషాద ఘటనపై పోలీసులు దర్యాప్తు వేగవంతం చేశారు. ప్రమాదానికి డ్రైవర్ నిర్లక్ష్యమే కారణమని ప్రాథమిక విచారణలో తేలడంతో, బస్సు డ్రైవర్ యువరాజుతో పాటు యజమాని హరికృష్ణను పోలీసులు అరెస్ట్ చేశారు. డ్రైవర్‌ను ప్రధాన నిందితుడిగా చేరుస్తూ సెక్షన్ 304ఏ కింద కేసు నమోదు చేశారు.ప్రస్తుతం వీరిద్దరిని పోలీసులు విచారిస్తున్నారు. విచారణ ముగిసిన అనంతరం కోర్టులో హాజరుపరచనున్నారు. కోర్టు వీరికి రిమాండ్ విధించే అవకాశం ఉంది. టిప్పర్ లారీని ఢీకొట్టిన ఈ ప్రమాదంలో 13 మంది సజీవ దహనం కాగా, చికిత్స పొందుతూ ఒక బాలుడు మరణించాడు.

# లాక్‌డౌన్ అంశం పరిశీలనలో కూడా లేదు

**న్యూఢిల్లీ,**పశ్చిమాసియాలో సంక్షోభం కారణంగా ప్రపంచవ్యాప్తంగా చమురు, ఎల్పీజీపై ఆందోళన నెలకొంది. ఈ క్రమంలో దేశంలో మరోసారి లాక్‌డౌన్ దిశగా అడుగులు పడుతున్నాయని, ఆంక్షలు విధిస్తారని ప్రచారం జరుగుతోంది. దీనిపై స్పందించిన కేంద్ర పెట్రోలియం మంత్రి హర్దీప్ పూరి.. భారత్‌లో చమురు నిల్వలు పుష్కలంగా ఉన్నాయని, ప్రస్తుతానికి లాక్‌డౌన్ అంశం పరిశీలనలో కూడా లేదని స్పష్టం చేశారు. భారత్ అన్ని రకాలుగా చర్యలు తీసుకుని, ప్రజలకు ఇబ్బంది లేకుండా చూస్తుందన్నారు. నేడు అన్ని రాష్ట్రాల ముఖ్యమంత్రులతో ప్రధాని మోదీ వర్చువల్‌గా సమావేశం కానున్నారు.చమురు ధరల పెరుగుదలపై ఎక్స్ లో పోస్ట్ చేసి సమాచారం అందించారు. గత నెల రోజులుగా అంతర్జాతీయ ముడి చమురు ధరలు ఆకాశాన్ని తాకుతున్నాయని, దాదాపు 70 డాలర్ల నుండి బ్యారెల్ దాదాపు 122 డాలర్లకు పెరిగాయని ఆయన తెలిపారు. దీని కారణంగా ప్రపంచవ్యాప్తంగా వినియోగదారులకు పెట్రోల్, డీజిల్ ధరలు పెరిగాయి. ఆగ్నేయాసియా దేశాల్లో దాదాపు 30 నుంచి 50% పెరిగింది. ఉత్తర అమెరికా దేశాల్లో 30 శాతం, యూరప్‌లో 20%, ఆఫ్రికా దేశాల్లో 50 శాతం పెరిగింది.కేంద్ర ప్రభుత్వం వద్ద రెండు ఆప్షన్లు ఉన్నాయి. ఇతర దేశాల మాదిరిగానే ఇంధన ధరలను భారీగా పెంచాలా లేదా పౌరులను అంతర్జాతీయ అస్థిరత నుండి రక్షించడానికి తమ ఆర్థిక వ్యవస్థపై భారం మోయాలా అని అన్నారు. ప్రధానమంత్రి మోదీ రష్యా- ఉక్రెయిన్ సంఘర్షణ ప్రారంభమైనప్పటి నుండి గత 4 సంవత్సరాలుగా తన ప్రభుత్వం చేసిన వాగ్దానాన్ని నెరవేరుస్తూ, భారత పౌరుల భద్రత కోసం మరోసారి ఆర్థిక పరిస్థితిపై భారం మోయాలని నిర్ణయించుకున్నారని తెలిపారు.అంతర్జాతీయ స్థాయిలో పెట్రోల్, డీజిల్ ధరలు ఆకాశాన్ని తాకుతున్న ఈ సమయంలో చమురు కంపెనీలకు భారీ నష్టం వాటిల్లుతుంది. దాంతో లీటరుకు రూ. 24, డీజిల్పై లీటరుకు రూ. 30 వరకు లోటు ఉంది. దీన్ని తగ్గించడానికి ప్రభుత్వం తన ఆదాయంలో భారీ కోత విధించిందని కేంద్ర మంత్రి హర్దీప్ పూరి తెలిపారు. పెట్రోల్, డీజిల్ అంతర్జాతీయ ధరలు భారీగా పెరగడం వల్ల ఎగుమతి పన్ను కూడా విధిస్తారు. విదేశాలకు ఎగుమతి చేసే ఏదైనా రిఫైనరీ ఎగుమతి పన్ను చెల్లించవలసి ఉంటుందిప్రపంచ పరిస్థితి ఇంకా అనిశ్చితంగానే ఉందని, ఇంధనం, అవసరమైన వస్తువులకు సంబంధించిన పరిస్థితులను నిరంతరం పరిశీలిస్తున్నామని హర్దీప్ పూరి అన్నారు. ప్రధానమంత్రి మోదీ నేతృత్వంలో దేశంలో ఇంధనం, ఎనర్జీతో పాటు ఇతర అవసరమైన వస్తువుల సరఫరాకు ఎటువంటి అంతరాయం కలగకుండా ప్రభుత్వం చూసుకుంటోంది. అన్ని సవాళ్లను ఎదుర్కోవడానికి మేము పూర్తిగా సిద్ధంగా ఉన్నామని తెలిపారు..గతంలో కూడా ప్రపంచ అనిశ్చితి మధ్య భారత్ తన బలాన్ని చాటుకుందని, భవిష్యత్తులోనూ సమయానికి అనుగుణంగా, సమన్వయంతో చర్యలు తీసుకుంటామని కేంద్ర మంత్రి మర్దీప్ పూరి అన్నారు. లాక్డౌన్ గురించి వస్తున్న పుకార్లు పూర్తిగా అవాస్తవం అన్నారు. ప్రభుత్వం స్థాయిలో అలాంటి ప్రతిపాదన ఏదీ పరిశీలనలో లేదని క్లారిటీ ఇచ్చారు. ఎవరూ వదంతులను వ్యాప్తి చేయవద్దని, బాధ్యతాయుతంగా నడుచుకోవాలని పౌరులకు సూచించారు.

# రీల్స్ పిచ్చి

**హైదరాబాద్** సాధారణ గృహిణిగా జీవితాన్ని ప్రారంభించి, ఇన్‌స్టా రీల్స్‌తో సోషల్ మీడియాలో గుర్తింపు తెచ్చుకుని, చివరికి ఉగ్రవాద కార్యకలాపాల్లో చిక్కుకున్న సయీదా బేగం కథ ఇది. పాతబస్తీ చంచల్‌గూడకు చెందిన 38 ఏళ్ల సయీదా బేగం, తెలియక ఉగ్రవాదుల ఉచ్చులో చిక్కుకుందా లేక వలపు వలకు బలైందా అనే ప్రశ్నలు ఇప్పుడు తలెత్తుతున్నాయి.పదేళ్ల క్రితం విజయవాడకు చెందిన వ్యక్తితో సయీదాకు వివాహం జరిగింది. కానీ, మద్యానికి బానిసైన భర్త నిత్యం వేధించడంతో ఏడాది క్రితం ఆరేళ్ల కుమారుడితో కలిసి పుట్టింటికి వచ్చేసింది. ఇక్కడ స్థానికంగా ఇళ్లలో పనిచేస్తూ, తన తల్లిదండ్రులకు ఆసరాగా నిలిచింది. ఈ క్రమంలో తనలోని గజల్స్ పాడే నైపుణ్యాన్ని, వంటలు, కుట్టుపనులను ఇన్‌స్టాగ్రామ్ రీల్స్ రూపంలో పోస్ట్ చేయడం మొదలుపెట్టింది. అనతికాలంలోనే ఆమెకు 30 వేల మంది ఫాలోవర్లు అయ్యారు. రీల్స్ ద్వారా డబ్బులు కూడా వస్తుండటంతో దాన్నే ఆదాయ మార్గంగా మార్చుకుంది.క్యాన్సర్‌తో బాధపడుతున్న తల్లి, రెండో పెళ్లి చేసుకోవాలని సయీదాపై ఒత్తిడి తీసుకువచ్చింది. దీంతో, తనకు ఒక తోడు కావాలంటూ సయిదా ఇన్‌స్టాగ్రామ్‌లో ఒక పోస్ట్ పెట్టింది. ఇదే అదనుగా భావించిన విజయవాడకు చెందిన ఓ ఉగ్రవాది, తాను పోలీసునంటూ పరిచయం చేసుకున్నాడు. తన భార్యతో గొడవలున్నాయని, ఆమెను వదిలేసి తననే పెళ్లి చేసుకుంటానని నమ్మబలికాడు. అతని మాటలు నమ్మిన సయీదా రోజూ వాట్సాప్‌లో చాటింగ్ చేసేది.సయీదాకు ఉన్న సోషల్ మీడియా ప్రభావాన్ని గమనించిన ఆ ఉగ్రవాది ఆమెను తమ కార్యకలాపాలకు ఒక అస్త్రంగా వాడుకోవాలని ప్లాన్ చేశాడు. ఆమెను కలిసి మాటలతో ఆకట్టుకుని, తమ ఉగ్రవాద సందేశాలను ఆమె ఇన్‌స్టా ఖాతా ద్వారా ప్రచారం చేసేలా ఒప్పించాడు. విదేశీ హ్యాండ్లర్ అల్-హకీమ్ షుక్రూ మార్గదర్శకత్వంలో ఆమె సుమారు 7 రాష్ట్రాలకు చెందిన 42 మందితో ఒక వాట్సాప్ గ్రూప్‌ను ఏర్పాటు చేసి తీవ్రవాద ప్రచారాన్ని ముమ్మరం చేసింది.ఆమె కార్యకలాపాలపై నిఘా పెట్టిన విజయవాడ పోలీసులు, ఇటీవల సయీదా బేగంను అదుపులోకి తీసుకున్నారు. కాగా, అరెస్టుకు ముందు ఆమె తల్లిదండ్రులు ఒక పెళ్లి సంబంధం తీసుకురాగా, సోషల్ మీడియాకు దూరంగా ఉండాలనే షరతుతో ఆమె కొన్ని మెసేజ్‌లు, రీల్స్‌ను డిలీట్ చేసినట్లు సమాచారం.

# ఇన్ స్టాలో ప్రేమ...
## మొగుడ్ని వదిలేసి... చివరకు అలా

**కాకినాడ** సోషల్ మీడియా పరిచయం ఇద్దరి ప్రాణాలను బలిగొంది. ఇన్‌స్టాగ్రామ్ ద్వారా ఏర్పడిన పరిచయం వివాహేతర సంబంధానికి, చివరకు ఆత్మహత్యకు దారితీసింది. ఈ ఘటనలో కన్నబిడ్డలను, భర్తను వదిలేసి వచ్చిన ఒక మహిళ, తన ప్రియుడితో కలిసి కాలువలో దూకి ఆత్మహత్య చేసుకోవడం స్థానికంగా కలకలం రేపింది. ఏలూరు జిల్లాలో ఈ విచిత్రకరమైన ఘటన జరిగింది.ఏలూరు జిల్లా ఉంగుటూరు మండలం నాచుగుంట గ్రామ సమీపంలోని యర్రమళ్లకు చెందిన మావుళ్లయ్యకు, శ్రీకాకుళం జిల్లా సింగుపురానికి చెందిన రమతో రెండేళ్ల కిందటే ఇన్‌స్టాగ్రామ్ ద్వారా పరిచయం ఏర్పడింది. రమకు అప్పటికే వివాహమై ఇద్దరు పిల్లలు ఉన్నారు. కానీ వీరిద్దరి ఇన్‌స్టా పరిచయం కాస్తా ప్రేమగా మారింది. చివరకు వివాహేతర సంబంధానికి దారితీయడంతో సమస్య మొ?దలైంది. ఇటీవల రమ తన కుటుంబాన్ని వదిలి మావుళ్లయ్య ఊరికి వచ్చేసింది. అక్కడ వీరిద్దరూ పెళ్లి కూడా చేసుకున్నారు. అయితే, ఈ విషయం తెలుసుకున్న రమ కుటుంబ సభ్యులు యర్రమళ్లకు వచ్చి గొడవ పడటంతో పాటు, ఆమెను బలవంతంగా సొంత ఊరు యర్రమళ్లకు తీసుకెళ్లారు.కుటుంబ సభ్యులు తీసుకెళ్లినప్పటికీ, తన ప్రియుడ్ని విడిచి ఉండలేక రమ మళ్లీ తిరిగి రావడంతో మావుళ్లయ్య ఆమెను సీక్రెట్‌గా ఉంగుటూరులో ఓ గదిలో ఉంచాడు. ఈ నెల 24న తన అన్న కుమారుడు సతీష్2కు ఫోన్ చేసి రమ వచ్చిన విషయం చెప్పిన మావుళ్లయ్య, అక్కడికి వస్తే ఏం చేయాలో మాట్లాడదాం అని పిలిచాడు. ఆ తర్వాత ఆమెతో కలిసి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. చిన్నాన్న మావూళ్లయ్యను కలిసేందుకు వచ్చిన సతీష్‌కు నాచుగుంట కాలువ గట్టుపై మావుళ్లయ్య వస్తువులు కనిపించడంతో అనుమానం వచ్చి బంధువులతో కలిసి పోలీసులకు సమాచారం ఇచ్చాడు. గాలింపు చర్యలు చేపట్టగా బుధవారం ఉదయం మావుళ్లయ్య మృతదేహం లభ్యమైంది.రమ కూడా కనిపించడం లేదని, ఆమె కూడా ఆత్మహత్య చేసుకుని ఉండొచ్చునని భావించి ఆ తర్వాత ఎన్డీఆర్‌ఎఫ్ బృందాల సాయంతో గాలించగా చేబ్రోలు సమీపంలో రమ మృతదేహం లభ్యమైంది. ఈ ఇద్దరు ఆత్మహత్య చేసుకోవడం రెండు కుటుంబాలను చిన్నాభిన్నం చేసింది. ఈ ఘటనతో అటు మావుళ్లయ్య తల్లిదండ్రులు కుమారుడు చనిపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇటు రమ ఇద్దరు చిన్నారులు తల్లిలేని వారయ్యారు. సోషల్ మీడియాలో ఏర్పడే అపరిచిత బంధాలు ఎంతటి అనర్థాలకు దారితీస్తాయో ఈ ఘటన మరోసారి నిరూపించింది. పోలీసులు ఈ కేసు నమోదు చేసి దర్యాప్తును ముమ్మరం చేశారు.

# రజత కాంతుల్లో మెరిసిపోతున్న ఒంటిమిట్ట శ్రీ కోదండరామస్వామి బ్రహ్మోత్సవ శోభ





**బద్వేలు** కడప జిల్లా ఒంటిమిట్టలోని పవిత్రక్షేత్రమైన శ్రీ కోదండరామస్వామి ఆలయంలో జరగనున్న వార్షిక బ్రహ్మోత్సవాల సందర్భంగా భక్తుల హృదయాలను పరవశింపజేసేలా టిటిడి అత్యంత వైభవంగా విద్యుత్ అలంకరణలను చేపట్టింది. వెన్నెలను తలపించే వెలుగుల మధ్య ఆలయ పరిసరాలు ఆధ్యాత్మిక ఆనందాన్ని ప్రసరింపజేస్తూ భక్తులకు దివ్యానుభూతిని అందిస్తున్నాయి.ఒంటిమిట్ట ఆలయం లోపల మరియు వెలుపల ప్రాంతాలు, పరిసర ప్రాంతాలు, టిటిడి భవనం, వాహన మండపం, ఆలయం ముందు గార్డెన్, ప్రధాన కూడళ్లు, అలాగే ఒంటిమిట్ట నుండి మాధవవరం వరకు మార్గమంతా విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించారు. నాలుగు మాడ వీధులు, పుష్కరిణి, పార్కింగ్ ప్రాంతం, ఒంటిమిట్ట పరిసర ప్రాంతాలు, కల్యాణ వేదిక తదితర ప్రాంతాలు రాత్రివేళల్లో రజత కాంతులతో మెరిసిపోతూ బ్రహ్మోత్సవాలకు అపూర్వమైన శోభను చేకూర్చుతున్నాయి.బ్రహ్మోత్సవాల సందర్భంగా 30కి పైగా దేవతామూర్తుల పెద్ద బొమ్మలు, 70కు పైగా ప్రత్యేక డిజైన్ బోర్డులు, అలాగే అనేక అద్భుత ఇల్యూమినేషన్ బోర్డులను ఏర్పాటు చేశారు. దేవాతామూర్తుల పెద్ద బొమ్మలలో శ్రీరామ పట్టాభిషేకం, శ్రీరామ కల్యాణం, అయోధ్య రాముడు, రామబాణం, ఏనుగు మీద శ్రీవారు, గరుత్మంతుడిపై శ్రీవారు, శ్రీ పద్మనాభ స్వామి, అమ్మవారి త్రీడీ రూపం, శ్రీరాముడు ? శబరి, దశావతారాలు, అష్టలక్ష్ములు వంటి దివ్యరూపాలు విద్యుత్ కాంతుల్లో ప్రకాశిస్తూ భక్తులకు ఆధ్యాత్మిక సౌందర్యాన్ని పంచనున్నాయి.అదేవిధంగా 20 వేల సీరియల్ లైట్స్, 10 వేల ఫ్లడ్ లైట్లు, 500 రంగు రంగుల లైట్లు, 40 జనరేటర్లు, వివిధ రకాల తోరణాలతో ఒంటిమిట్ట అంతా ప్రకాశవంతంగా మారి బ్రహ్మోత్సవాల వైభవాన్ని మరింత పెంచనున్నాయి.

# కనుల వైభోగమే శ్రీ సీతారాముల కళ్యాణం

**- అంగరంగ వైభవంగా శ్రీ సీతారాముల కళ్యాణం వేడుకలు**




**కౌతాళం** కనుల వైభవంగా అంగరంగ వైభవంగా శ్రీ సీతారాముల కళ్యాణ కళ్యాణం వేడుకలు ఘనంగా నిర్వహించారు. మేళా తాళాలు పండితుల వేద మంత్రాలు ఒక్కటైనా శ్రీ సీతారాముల కళ్యాణం చూడముచ్చట కనులవిందుగా జరిగింది. శ్రీరామనవమి సందర్భంగా రాజనగర్ క్యాంపులో అంగరంగ వైభవంగా శ్రీరాముని ఆలయంలో పూల అలంకరణ విద్యుత్ దీపాలతో కనువిందు చేశాయి. శ్రీ సీతారాముల కళ్యాణం చూడటానికి చుట్టుపక్కల గ్రామ ప్రజలు తరలివచ్చారు. కళ్యాణ వేదికలో బాపిరాజు వారి సతీమణి జాహ్నవి దంపతులుగా కూర్చున్నారు. వారి ఆధ్వర్యంలో వేద పండితులు చేతులు మీదుగా శ్రీ సీతారాముని కళ్యాణం నిర్వహించారు. నైవేద్య టెంకాయలు కొట్టి పూజలు నిర్వహించి ముక్కులు తీర్చుకున్నారు. పలువురు రాజకీయ నాయకులు శ్రీరాముని ఆలయంలో శ్రీ సీతారాముల కళ్యాణం తిలకించి మొక్కలు చెల్లించుకున్నారు. గ్రామ పెద్దలు భక్తులు కు అన్నదాన వసతి కార్యక్రమాలు నిర్వహించారు. పలువురు నాయకులకు పలా ప్రసాదములు అందించారు

# ఆధ్యాత్మిక వాతావరణంలో సీతారాముల కళ్యాణం

**- కుటుంబంతో హాజరైన శ్రీనివాస్ బాబు.**

**జయశంకర్ భూపాలపల్లి.**జయశంకర్ భూపాలపల్లి జిల్లా, కాటారం మండలం, ధన్వాడ గ్రామంలోని శ్రీ దత్తాత్రేయ స్వామి వారి ఆలయ ప్రాంగణంలో అత్యంత భక్తిశ్రద్ధలతో,శుక్రవారం ఘనంగా నిర్వహించిన శ్రీ సీతారాముల కళ్యాణ మహోత్సవంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి దుద్దిళ్ల శ్రీనివాస్ బాబు కుటుంబ సమేతంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కళ్యాణ మండపం వద్ద స్వామి వారి దివ్య కళ్యాణాన్ని కుటుంబ సభ్యులతో కలిసి భక్తిశ్రద్ధలతో ప్రత్యక్షంగా దర్శించుకున్నారు. కళ్యాణ వేడుకల సమయంలో హారతి ఇచ్చి, ప్రత్యేక పూజలు నిర్వహించి, స్వామి వారి ఆశీర్వాదాలు పొందారు. ఆధ్యాత్మిక వాతావరణంలో జరిగే ఈ పవిత్ర వేడుకలో పాల్గొనడం తనకు ఎంతో ఆనందాన్ని కలిగించిందని, ఇలాంటి దైవ కార్యక్రమాలు మన సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకలని పేర్కొన్నారు. అనంతరం గ్రామ ప్రజలతో స్నేహపూర్వకంగా మాట్లాడిన శ్రీనివాస్ బాబు ప్రతి కుటుంబం సుఖశాంతులతో ఆయురారోగ్యాలతో అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. అభివృద్ధి, ప్రజల సంక్షేమం తన ప్రధాన లక్ష్యమని ఎప్పటికప్పుడు ప్రజలతో కలిసి ఉండి వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు.

# బస్సు దగ్ధం కేసులో యజమాని అరెస్టు

**మార్కాపురం జిల్లా...**మార్కాపురం లో జరిగిన బస్సు ప్రమాద ఘటనకు సంబంధించిన హరికృష్ణ ట్రావెల్స్ యజమాని హరికృష్ణ రెడ్డి ని నెల్లూరు పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పోలీస్ స్టేషన్ లో హరికృష్ణ రెడ్డిని విచారిస్తున్నారు. పరారీలో ఉన్న హరికృష్ణ రెడ్డిని సెల్ ఫోన్ సిగ్నల్ ద్వారా గుర్తించి అరెస్ట్ చేసారు.

## యానం కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి

# గొల్లపల్లి అశోక్‌కు జన నీరాజనం

**యానం..** యానం కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి గొల్లపల్లి అశోక్ కు జనం నీరాజనం పలుకుతున్నారు. రెండోసారి ఎంఎల్ఎ గా గెలిపించాలని కోరుతూ గొల్లపల్లి ఎన్నికల ప్రచారంలో దూసుకుపోతున్నారు. ఏ ప్రాంతంలో ప్రచారం నిర్వహించినా ప్రజలు అడుగడుగునా మద్దతు ప్రకటిస్తూ ఆశీర్వాదం ఇస్తున్నారు.యానం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు అర్థానీ దినేష్ తో కలిసి గొల్లపల్లి యానంలోని అనేక ప్రాంతాలలో ప్రచారాన్ని హోరెత్తిస్తున్నారు. యానాంలోని దరియాలతిప్ప, సావిత్రి నగర్, స్థానిక బీమ్ నగర్, యూకేవీ నగర్ లలో ఎన్నికల ప్రచారం మద్దతుదారులతో ఉత్సాహంగా సాగుతుంది. అణువణువునా గొల్లపల్లి అశోక్ కి కార్యకర్తలు, అభిమానులు, మహిళలు హారతులు ఇచ్చి పూల వర్షంతో స్వాగతం పలికారు...ఈ సందర్భంగా గొల్లపల్లి అశోక్ మాట్లాడుతూ ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపు చారిత్రాత్మక అవసరం అని, ఇన్నాళ్లు అభివృద్ధికి నోచుకోకుండా పేదరికంతో నిండిన యానాన్ని రక్షించుకునేందుకు తనను గెలిపించాలని, కాంగ్రెస్ పార్టీ గెలుపు ద్వారా పేద ప్రజలందరికీ ఇళ్ల స్థలాలు ఇచ్చి సొంత గృహాలు ఏర్పాటు చేస్తానని, మెరుగైన వైద్యం యానంలోనే జరిగే విధంగా హాస్పిటల్స్ లో ప్రత్యేక వసతులు కల్పిస్తామని, 30 సంవత్సరాల బానిసత్వం నుండి విముక్తి పొంది ప్రజలు స్వేచ్ఛగా ఉండేందుకు తనను భారీ మెజార్టీతో గెలిపించాలని ఓటర్ల ను అభ్యర్థించారు.

# కనుల పండుగగా ప్రసన్నాంజనేయ స్వామి పునః ప్రతిష్ట

**సత్తుపల్లి** ఖమ్మం జిల్లా సత్తుపల్లి హనుమాన్ నగర్‌లో పునర్నిర్మించిన ఆంజనేయ స్వామి ఆలయంలో ప్రసన్నాంజనేయ స్వామి పునః ప్రతిష్ట వైభవంగా జరిగింది. చైత్రమాస శుద్ధ సప్తమి సందర్భంగా పండితులు శాస్త్రోక్తంగా యంత్ర స్థాపన చేసి స్వామిని ప్రతిష్టించారు.ఈ కార్యక్రమాల్లో విజయ గణపతి, సుబ్రహ్మణ్యేశ్వర స్వామి తదితర విగ్రహాల ప్రతిష్టలు కూడా భక్తుల జైశ్రీరామ్, జై హనుమాన్ నినాదాల మధ్య ఘనంగా నిర్వహించారు. యాగశాలలో హోమాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఎండోమెంట్ నిధులు, భక్తుల విరాళాలతో ఆలయాన్ని అందంగా నిర్మించి, సుమారు 8 వేల మంది భక్తులకు అన్నదాన ఏర్పాట్లు చేసి సౌకర్యాలు కల్పించారు.

## ధర్మారం మండలంలో ఘనంగా

# శ్రీరామనవమి వేడుకలు..

**- ధర్మారంలో పాల్గొన్న అడ్లూరి లక్ష్మణ్ కుమార్**



**ధర్మారం,** పెద్దపల్లి జిల్లా ధర్మారం మండలంలోని పలు గ్రామాల్లో శ్రీరామనవమి వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ధర్మారం, ఖిలావనపర్తి, కమ్మర్ ఖాన్ పేట, బుచ్చయ్యపల్లి గ్రామాలలోని శ్రీ రామాలయాలలో ఈ వేడుకలను ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ధర్మారంలో ఆలయ నిర్వాహకులు, ధర్మకర్తలు పూస్కురు పద్మజ జితేందర్ రావు, ఖిలావనపర్తి గ్రామంలో ఆలయ కమిటీ చైర్మన్ మెట్టుపల్లి అశోక్ రావు ఆధ్వర్యంలో శ్రీరామనవమి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా ఆలయాలలో వేద పండితులు సీతారామ కళ్యాణం కన్నుల పండువగా నిర్వహించారు. ధర్మారంలో నిర్వహించిన వేడుకలకు రాష్ట్రమంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా లక్ష్మణ్ కుమార్‌ను ఆలయ ధర్మకర్తలు పద్మజ జితేందర్ రావు సన్మానించారు. ఖిలా వనపర్తి గ్రామంలో జరిగిన వేడుకలకు నంది మేడారం ప్యాక్స్ మాజీ చైర్మన్ ముత్యాల బలరాం రెడ్డి హాజరయ్యారు.

# గంగాధరలో వైభవంగా సీతారాముల కల్యాణం



**గంగాధర,** గంగాధర మండలంలోని ర్యాలపల్లి, బూరుగుపల్లి, కోట్లనరసింహులపల్లి, లక్ష్మీదేవిపల్లి, గంగాధర, మధురానగర్, మల్లాపూర్, కురిక్యాల, ఉప్పరమల్యాల, కాసారం, గర్శకుర్తి, గట్టుభూత్కూర్ గ్రామాల్లో శుక్రవారం శ్రీరామనవమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు ఆలయాలను ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయ పురోహితులు సీతారాముల కల్యాణాన్ని కన్నుల పండువగా నిర్వహించారు. ఈ తంతులో మహిళలు అమ్మవారికి ఓడి బియ్యం పోసి మొక్కలు చెల్లించుకున్నారు.అనంతరం నిర్వాహకులు భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఉప్పరమల్యాల, కురిక్యాల, మధురానగర్ లో నిర్వహించిన శ్రీరామనవమి వేడుకల్లో ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం పాల్గొన్నారు. ఉప్పరమల్యాలలో స్వామివారి కల్యాణానికి కొండగట్టునుండు వచ్చిన పట్టు వస్త్రాలను ఎమ్మెల్యే సమర్పించారు. శ్రీరామనవమి వేడుకలను మండల ప్రజలు సంతోషంగా జరుపుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కురిక్యాల సింగిల్ విండో మాజీ చైర్మన్ వెలిచాల తిరుమలరావు, పురుమల్ల మనోహర్, సర్పంచులు ముద్దం నగేష్, కడారి రేణుక కనకయ్య, వేముల భాస్కర్, మాజీ వైస్ ఎంపీపీ కర్ర బాపురెడ్డి, నాయకులు కర్ర కార్తీక్ రెడ్డి, కనకట్ల తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

## అయోధ్య రామయ్యను తాకిన

# సూర్యకిరణాలు..

యూపీలోని అయోధ్య రామ మందిరంలో అద్భుత దృశ్యం ఆవిష్కృతమైంది. సరిగ్గా మ. 12 గంటలకు రామ్ లల్లా నుదుటిపై సూర్య కిరణాలు పడ్డాయి. ఈ అద్భుత దృశ్యాన్ని తిలకించేందుకు లక్షలాది మంది భక్తులు రామాలయానికి పోటెత్తారు. దీన్ని కళ్లారా వీక్షించిన వారంతా భక్తపారవశ్యంతో.. జై శ్రీరామ్ అంటూ నినాదాలు చేశారు. సూర్యతిలకానికి సంబంధించిన వీడియో నెట్టింట వైరల్ అవుతోంది..

## రామనవమి శోభా యాత్ర ఏర్పాట్లను

# పరిశీలించిన సీపీ



**హైదరాబాద్** శ్రీరామనవమి శోభాయాత్రను పురస్కరించుకుని హైదరాబాద్ నగర పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనర్, శుక్రవారం సీతారాం బాగ్ పరిసరాల్లో చేపట్టిన భద్రతా ఏర్పాట్లను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా సీపీ మీడియాతో మాట్లాడుతూ, నగరంలో జరగనున్న శ్రీరాముడి శోభాయాత్ర ప్రశాంతంగా సాగేందుకు పోలీస్ శాఖ అన్ని ఏర్పాట్లు పూర్తి చేసిందని వెల్లడించారు. ఈ యాత్ర ఇవాళ మధ్యాహ్నం 2 గంటలకు సీతారాం బాగ్ ఆలయం నుంచి ప్రారంభమై, రాత్రి 10 గంటల కల్లా ముగిసేలా పక్కా రూట్ మ్యాన్ సిద్ధం చేశామని తెలిపారు. ఇప్పటికే పలు శాఖల అధికారులతో కలిసి యాత్ర సాగే మార్గాలను క్షుణ్ణంగా పరిశీలించామని, ఎక్కడా ఎటువంటి ఆటంకాలు కలగకుండా డ్రోన్లు, సీసీ టీవీ కెమెరాల ద్వారా నిరంతరం నిశితంగా పర్యవేక్షిస్తామని పేర్కొన్నారు. ఈ భారీ శోభాయాత్ర కోసం దాదాపు 3 వేల మంది సిబ్బందితో పటిష్టమైన బందోబస్తును ఏర్పాటు చేసినట్లు వివరించారు. అంతకుముందు గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా, జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్, కలిసి ఆయన శ్రీ సీతారామచంద్ర స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

# గురునానక్ కాలేజీ విద్యార్థి ఆత్మహత్య

**ఇబ్రహీంపట్నం,** ఇబ్రహీంపట్నంలోని గురునానక్ కాలేజీలో బీటెక్ సెకండియర్ చదువుతున్న కందిమల్ల సాయి తన హాస్టల్ గదిలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడని పోలీసులు తెలిపారు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉంది. నల్లగొండ జిల్లాలోని నందిగూడెం మండలం శ్రీరంగాపురానికి చెందిన సాయి(20) గురునానక్ కాలేజీలో ఈసీఈ రెండవ ఏడాది చదువుతున్నాడు.

## పలు ఆలయాలలలో ఎంపి ఈటల

# శ్రీరామనవమి పూజలు



**సికింద్రాబాద్..**శ్రీరామనవమిని పురస్కరించుకుని కంటోన్మెంట్ లోని పలు రామ మందిరాలలో జరిగిన శ్రీసీతారామ కళ్యాణ మహోత్సవంలో మల్కాజ్ గిరి పార్లమెంటు సభ్యులు ఈటెల రాజేందర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఈటల రాజేందర్ స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి కళ్యాణ మహోత్సవాన్ని వీక్షించారు. వివిధ రకాల పూలు పండ్లు అలంకరణలతో రామాలయాలు శోభాయామానంగా ఆధ్యాత్మిక శోభను సంతరించుకున్నాయి. శ్రీ సీతారాముల కళ్యాణాన్ని చూసేందుకు పెద్ద ఎత్తున ప్రజలు తరలివచ్చారు.

# తెనాలిలో ఘనంగా శ్రీరామనవమి వేడుకలు

**గుంటూరు..**తెనాలి పట్టణంలో శ్రీరామ నవమి వేడుకలు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు,. తెనాలి పట్టణంలోని వాడవాడలలో భక్తులు ఉత్సాహంగా పాల్గొని ఆధ్యాత్మిక వాతావరణాన్ని సృష్టించారు. తెనాలి గాడిబావి సెంటర్ల వద్ద సీతారాముల కళ్యాణ ఉత్సవం వైభవంగా జరిగింది. వేదమంత్రాల నడుమ అర్చకులు నిర్వహించిన ఈ దివ్య కళ్యాణ కార్యక్రమాన్ని చూడటానికి పెద్ద సంఖ్యలో భక్తులు హాజరయ్యారు. కళ్యాణం అనంతరం భక్తమహాసైనులకు నుచ్చాలా తరంపరాలను ప్రసాదంగా అందించారు.

భక్తులు భక్తిశ్రద్ధలతో ప్రసాదాన్ని స్వీకరించారు. అలాగే తెనాలి హనుమాన్ చౌక్ ప్రాంతంలోని రామమందిరంలో కూడా సీతారాముల కళ్యాణం ఘనంగా జరిగింది. ఆలయ ప్రాంగణం పుష్పాలతో అలంకరించి పండుగ వాతావరణాన్ని తీసుకువచ్చారు. కార్యక్రమంలో స్థానిక ప్రజలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని దేవుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కళ్యాణం అనంతరం అన్నదాన కార్యక్రమం కూడా నిర్వహించి భక్తులకు ప్రసాదం పంపిణీ చేశారు. ఈ వేడుకల ద్వారా పట్టణంలో భక్తి, ఆధ్యాత్మికత మరింత పెరిగింది. చిన్నపిల్లల నుంచి పెద్దల వరకు అందరూ పాల్గొని పండుగను ఆనందంగా జరుపుకున్నారు. స్థానిక నిర్వాహకులు, ఆలయ కమిటీ సభ్యులు సమన్వయంతో కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించడంపై భక్తులు అభినందనలు తెలిపారు. మొత్తంగా తెనాలి పట్టణం భక్తిరసంలో మునిగిపోయింది.

# ధ్వజారోహణంతో వైభవంగా శ్రీ కోదండరామస్వామి శ్రీరామనవమి బ్రహ్మోత్సవాలు ప్రారంభం


**తిరుపతి / ఒంటిమిట్ట 2026 మార్చి 27** ఒంటిమిట్ట శ్రీ కోదండరామస్వామి ఆలయంలో శుక్రవారం ఉదయం ధ్వజారోహణంతో శ్రీరామనవమి బ్రహ్మోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. ఉదయం 9.30 నుండి 10.15 గంటల మధ్య వృషభ లగ్నంలో పాంచరాత్ర ఆగమశాస్త్రబద్ధంగా గరుడపటాన్ని ప్రతిష్టించి శాస్త్రోక్తంగా ధ్వజారోహణ ఘట్టం నిర్వహించారు. కంకణబట్టర్ రాజేష్ కుమార్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది.ముందుగా గరుడ ధ్వజపటాన్ని ఊరేగింపుగా తీసుకొచ్చి గరుడ ప్రతిష్ట, ప్రాణప్రతిష్ట, నేత్రోల్మీలనం నిర్వహించారు. ధ్వజస్తంభానికి నవకలశ పంచామృతాభిషేకం చేసినట్టు చెశారు.

రాగతాళ నివేదన ద్వారా ఇంద్రాది సకలదేవతలను, నవగ్రహాలను, అష్టదిక్పాలకులను బ్రహ్మోత్సవాలకు ఆహ్వానించి ధ్వజారోహణం నిర్వహించారు.ఈ సందర్భంగా వేదపండితులు చతుర్వేద పారాయణం చేశారు.ఈ కార్యక్రమంలో డెప్యూటీ ఈవోలు ఎ. ప్రశాంతి, ఎ. శివప్రసాద్, ఇతర అధికారులు, విశేష సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

### కుస్తీ యోధుడిగా

# రామ్ చరణ్..

### అంచనాలు పెంచిన 'పెద్ది' ఫస్ట్ గ్లింప్స్



మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ పుట్టినరోజు సందర్భంగా అభిమానులకు అదిరిపోయే కానుక అందింది. ఆయన కథానాయకుడిగా, 'ఉప్పెన' ఫేమ్ బుచ్చిబాబు సానా దర్శకత్వంలో తెరకెక్కుతున్న భారీ చిత్రం 'పెద్ది' నుంచి ఫస్ట్ గ్లింప్స్ విడుదలైంది. రామ్ చరణ్‌ను మునుపెన్నడూ చూడని అత్యంత రగ్గడ్, మాస్ అవతారంలో చూపించి దర్శకుడు బుచ్చిబాబు సినిమాపై ఆసక్తిని రేకెత్తించారు. ఈ గ్లింప్స్ ప్రారంభంలో వినిపించే 'కుస్తీ అంటే బ్యాట్‌తో బంతికి ఎదురెళ్లే ఆట కాదురా.. ప్రాణంతో చావుకి ఎదురెళ్లే ఆట' అనే సంభాషణ, ఇది కేవలం క్రీడా నేపథ్య చిత్రం కాదని, ఓ యోధుడి జీవన్మరణ పోరాటమని దర్శకుడు చెప్పకనే చెప్పాడు. ఈ పవర్‌ఫుల్ డైలాగ్ అభిమానులను విశేషంగా ఆకట్టుకుంటోంది. కుస్తీ, క్రికెట్ నేపథ్యంలో సాగే ఈ పీరియడ్ డ్రామాలో చరణ్ పాత్ర ఎంతో శక్తివంతంగా ఉండబోతున్నట్టు ఈ గ్లింప్స్ హింట్ ఇచ్చింది. విజువల్స్‌లో రామ్ చరణ్ మేకోవర్ అద్భుతమనే చెప్పాలి. కండలు తిరిగిన శరీరంతో, ఒంటి నిండా మట్టి పూసుకుని, చేతిలో గద పట్టుకుని నడుస్తున్న చరణ్‌ను చూస్తుంటే, 'రంగస్థలం'లోని చిట్టిబాబును మించిన మాస్ అవతార్ అనిపిస్తోంది. ఆయన కళ్లలో కనిపించే పౌరుషం, గంభీరమైన నడక గ్లింప్స్‌కే హైలైట్‌గా నిలిచాయి. ఆస్కార్ విజేత ఏ.ఆర్. రెహమాన్ అందించిన నేపథ్య సంగీతం ఈ గ్లింప్స్‌కు ప్రాణం పోసింది. 1980ల నాటి గ్రామీణ వాతావరణాన్ని, కుస్తీ బరిలోని వేడిని తన సంగీతంతో ప్రేక్షకులకు అనుభూతిని కలిగించారు. ప్రస్తుతం ఈ గ్లింప్స్ యూట్యూబ్, సోషల్ మీడియాలో ట్రెండింగ్‌లో దూసుకుపోతోంది. అభిమానులు చరణ్ కెరీర్‌లో ఇది మరో మైలురాయిగా నిలుస్తుందని ధీమా వ్యక్తం చేస్తున్నారు. చిత్ర బృందం ప్రకటించిన ప్రకారం 'పెద్ది' ఏప్రిల్ 30న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది.

### పెళ్లిపై నాకు మంచి

# అభిప్రాయం లేదు

### - సాయిపల్లవి

టాలీవుడ్‌లో తనకంటూ ఒక ప్రత్యేక ఇమేజ్‌ను సంపాదించుకున్న సాయిపల్లవి... పెళ్లి గురించి, తన వ్యక్తిగత భావోద్వేగాల గురించి చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. తనకు పెళ్లిపై పెద్దగా మంచి అభిప్రాయం లేదని ఆమె తెలిపింది. పెళ్లైన వారు కూడా పెళ్లి చేసుకోవద్దని తనకు సలహా ఇస్తున్నారని చెప్పింది. అందుకే తనకు పెళ్లి చేసుకోవాలనే ఆలోచన లేదని తెలిపింది. ఒంటరిగానే తాను చాలా ప్రశాంతంగా ఉన్నానని, ప్రస్తుతం తన దృష్టంతా సినిమాలపైనే ఉందని స్పష్టం చేసింది. అయితే, అర్ధరాత్రి పూట ఏమీ తినకుండా ఏడుస్తూ కూర్చునే అలవాటు ఉందని తెలిపింది. ఆ సమయంలో కేవలం తన తల్లి మాత్రమే తనకు తోడుగా ఉంటుందని చెబుతూ ఆమె ఎమోషనల్ అయ్యారు. దీంతో, బయటకు ఎంతో నవ్వుతూ కనిపించే సాయి పల్లవి మనసులో ఇంతటి సున్నితత్వం, ఏదో తెలియని బాధ ఉన్నాయా? అని నెటిజన్లు చర్చించుకుంటున్నారు.



# 'ధురంధర్ 2'

## వసూళ్ల సునామీ..

### వారంలోనే రూ.1000 కోట్ల క్లబ్‌లోకి!



బాలీవుడ్ స్టార్ హీరో రణ్‌వీర్ సింగ్ నటించిన 'ధురంధర్ 2' చిత్రం బాక్సాఫీస్ వద్ద సరికొత్త చరిత్ర సృష్టిస్తోంది. విడుదలైన కేవలం ఏడు రోజుల్లోనే ఈ సినిమా ప్రపంచవ్యాప్తంగా రూ. 1000 కోట్ల గ్రాస్ వసూళ్ల మార్కును దాటింది. భారత్‌తో పాటు ఓవర్సీస్‌లోనూ అద్భుతమైన కలెక్షన్లతో దూసుకుపోతూ, అతి వేగంగా ఈ ఘనత సాధించిన చిత్రాల్లో ఒకటిగా నిలిచింది. ఈ సినిమా ప్రయాణం ఈ నెల 18న పెయిడ్ ప్రివ్యూలతో ప్రారంభమైంది. ప్రివ్యూల ద్వారానే దేశవ్యాప్తంగా రూ. 43 కోట్ల నెట్ వసూలు చేసి సంచనాలకు తెరలేపింది. ఇక తొలి రోజు (ఋుఎ 1) ఏకంగా రూ. 102.55 కోట్లు రాబట్టి బాక్సాఫీస్ వద్ద తన ఆధిపత్యాన్ని చాటింది. రెండో రోజు శుక్రవారం నాడు స్వల్పంగా తగ్గి రూ. 80.72 కోట్లు వసూలు చేసినా, వారాంతంలో మళ్లీ పుంజుకుంది. శనివారం రూ. 113 కోట్లు, ఆదివారం రూ. 114.85 కోట్లతో అసాధారణ వృద్ధిని నమోదు చేసింది. దీంతో తొలి వారాంతానికే భారత్‌లో నెట్ కలెక్షన్లు రూ. 411 కోట్లు దాటాయి. వారపు రోజుల్లోనూ 'ధురంధర్' జోరు తగ్గలేదు. సోమవారం రూ. 65 కోట్లు, మంగళవారం రూ. 56.60 కోట్లు, ఏడో రోజైన బుధవారం రూ. 48.25 కోట్లు సాధించి స్థిరమైన వసూళ్లను కొనసాగించింది. మొత్తం ఏడు రోజులకు గాను భారత్‌లో ఈ చిత్రం రూ. 623.97 కోట్ల నెట్ కలెక్షన్లు (రూ. 745.23 కోట్ల గ్రాస్) సాధించింది. విదేశాల్లోనూ ఈ సినిమాకు ప్రేక్షకులు బ్రహ్మరథం పడుతున్నారు. ఓవర్సీస్ మార్కెట్‌లో ఏడు రోజుల్లో రూ. 261.92 కోట్ల గ్రాస్ వసూలు చేసింది. దీంతో సినిమా మొత్తం వరల్డ్‌వైడ్ గ్రాస్ కలెక్షన్ రూ. 1,007.15 కోట్లకు చేరింది. పాజిటివ్ టాక్‌తో దూసుకుపోతున్న ఈ చిత్రం, రాబోయే రోజుల్లో ఇంకెన్ని రికార్డులు సృష్టిస్తుందోనని ట్రేడ్ వర్గాలు ఆసక్తిగా గమనిస్తున్నాయి.



### ప్రతి చిన్న విషయానికీ 'సారీ' చెప్పే అలవాటును

## మహిళలు ఇకనైనా ఆపాలి: సమంత

హీరోయిన్ సమంత రూత్ ప్రభు సినీ పరిశ్రమలో మహిళలు ఎదుర్కొంటున్న సవాళ్లపై మరోసారి తన గళాన్ని బలంగా వినిపించారు. గుర్తింపు పొందాలన్నా, తమను తాము నిరూపించుకోవాలన్నా మహిళలు ప్రతిదానికీ రెట్టింపు కష్టపడాల్సి వస్తోందని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. 'ది హాలీవుడ్ రిపోర్టర్ ఇండియా' నిర్వహించిన ఒక కార్యక్రమంలో పాల్గొన్న సమంత.. మహిళల స్థితిగతులపై తన అభిప్రాయాలను నిర్మొహమాటంగా పంచుకున్నారు. ఆమె వ్యాఖ్యలు ప్రస్తుతం సోషల్ మీడియాలో చర్చనీయాంశంగా మారాయి. సమాజంలో ఇతరుల సౌకర్యం కోసం మహిళలు తమ అభిప్రాయాలను, షెడ్యూళ్లను, చివరికి తమ ఆశయాలను కూడా త్యాగం చేయడం ఒక సాధారణ విషయంగా మారిపోయిందని సమంత పేర్కొన్నారు. తమ వ్యక్తిత్వాన్ని పక్కనపెట్టి ఇతరుల కోసం జీవించడం, వెనక్కి తగ్గడం మహిళలకు అలవాటైపోయిందని అన్నారు. ఈ త్యాగాలను చాలాసార్లు వారే గుర్తించలేని స్థితిలో ఉంటారని ఆమె అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా మహిళలకు ఆమె ఒక ముఖ్యమైన పిలుపునిచ్చారు. పురుషులతో పోలిస్తే మహిళలు ఎక్కువగా క్షమాపణలు చెబుతుంటారని, ప్రతి చిన్న విషయానికీ 'సారీ' చెప్పే అలవాటును ఇకనైనా ఆపాలని సూచించారు. "మనం మన స్థానాన్ని అర్హతతోనే సంపాదించుకున్నాం. కాబట్టి ఎవరైనా ప్రశంసించినప్పుడు దాన్ని గర్వంగా స్వీకరించాలి" అని సమంత అన్నారు. సినిమాల విషయంలో సామ్ మాట్లాడుతూ.. ఒక చిత్రాన్ని 'ఫీమేల్ లీడ్' సినిమా అని ప్రత్యేకంగా ట్యాగ్ చేయాల్సిన అవసరం లేని రోజు రావాలని ఆకాంక్షించారు. మహిళా పాత్రలు కేవలం హీరోకు సహాయపడేవిగా కాకుండా, స్వతంత్రంగా నిలబడేలా శక్తిమంతంగా ఉండాలని స్పష్టం చేశారు. అలాగే షూటింగ్ సెట్స్‌లో మహిళల భద్రత అనేది ఒక చర్చనీయాంశంగా కాకుండా పరిశ్రమలో ఒక ప్రాథమిక ప్రమాణంగా మారాలని ఆమె పేర్కొన్నారు. ప్రతి నటి సెట్‌లో పూర్తి భద్రతా భావంతో పనిచేసే వాతావరణం ఉండాలని సమంత కోరారు.

## 'బ్యాండ్ మేళం' మూవీ రివ్యూ



'కోర్ట్' చిత్రంతో అలరించిన జంట హర్ష రోషన్, శ్రీదేవి ముఖ్యతారలుగా నటించిన తాజా చిత్రం 'బ్యాండ్ మేళం'. పలు విజయవంతమైన చిత్రాలకు రచయితగా పనిచేసిన కోన వెంకట్ తన నిర్మాణ సంస్థలో ఈ చిత్రాన్ని నిర్మించాడు. 'కోర్ట్' చిత్రంతో అందరి దృష్టిని ఆకర్షించిన ఈ యువ జంటకు 'బ్యాండ్ మేళం' మూవీ సక్సెస్‌ను అందించందా? సినిమాలో ప్రేక్షకులను అలరించే అంశాలున్నాయా? లేదా అనేది చిత్ర సమీక్షలో తెలుసుకుందాం.. గిరి (హర్ష రోషన్) తనకు చదువు సరిపడదని చదువును మధ్యలోనే మానేసి సంగీత దర్శకుడు అవ్వాలనే కోరికతో ఫ్రెండ్స్‌తో కలిసి ఓ బ్యాండ్ బ్యాచ్‌ను రన్ చేస్తుంటాడు. గిరి మరదలు రాజీ (శ్రీదేవి) చదువులో టాపర్‌గా ఉంటుంది. ఈ ఇద్దరికి పెద్దయ్యాక పెళ్లి చేయాలని ఇరువురి తల్లిదండ్రులు చిన్నప్పుడే నిర్ణయించుకుంటారు. కానీ పరిస్థితులు మారిపోవడం. దీనికి తోడు గిరి చదువుకోకుండా, ఎటువంటి లక్ష్యం లేకుండా ఉండటంతో రాజీ కూడా గిరిని దూరం పెడుతుంది. కానీ గిరి మాత్రం రాజీ తనకు కాబోయే భార్య అని అందరికి చెప్పుకొంటుంటాడు. కానీ రాజీ తండ్రి, సాయన్న (సాయికుమార్) ఓ పెళ్లి సంబంధం చూసి రాజీకి పెళ్లి చేయాలని అనుకుంటాడు. ఈ సమయంలో రాజీ ఏం చేసింది? రాజీ, గిరిల పెళ్లి జరిగిందా? గిరి తన మరదలు మనసు గెలిచాడా? లేదా? సంగీత దర్శకుడిగా ఎదగాలనే అతని కల ఫలించిందా? లేదా తదితర విషయాల్ని వెండితెరపై చూసి తెలుసుకోవాల్సిందే. బావ మరదళ్ల ప్రేమకథతో ఇప్పటి వరకు తెలుగులో చాలా సినిమాలొచ్చాయి. ఆ నేపథ్య కథతో వచ్చిన ఈ సినిమా చూస్తుంటే ప్రతి సన్నివేశంలో ఆ పాత సినిమాలే గుర్గొస్తాయి. ఏ మాత్రం కొత్తదనం లేని రొటిన్ కథతో, బలహీనమైన సన్నివేశాలతో, అలరించని పాత్రలతో రూపొందించిన సినిమా ఇది. కథ, కథనాలు ఎంతో రొటిన్‌గా బోరింగ్‌గా అనిపిస్తాయి. సినిమా ప్రారంభం నుంచే అందరిలో ఈ పీల్ కలుగుతుంది. ఓ కొత్త తరహా కథతో, ఓ కొత్త సన్నివేశంతో ప్రేక్షకులను అలరించాలనే తపన మచ్చుకు కూడా సినిమాలో కనిపించదు. హీరో, హీరోయిన్ మధ్య వచ్చే సన్నివేశాలతో పాటు ప్రతి సీన్ భారంగా నడుస్తుండటంతో సినిమా ఆద్యంతం ఎక్కడా కూడా ఆసక్తిని కలిగించదు. తొలిభాగం సహనానికి పరీక్షగా నిలిస్తే.. రెండో భాగం చూడాలని ఓపికగా థియేటర్‌లోనే ఉన్నవాళ్లకు ఇంటర్వెల్ తరువాత వచ్చే సన్నివేశాలు కూడా అంతకు మించిన పరీక్షగా మారిపోతాయి. ఈ చిత్రంలో పాత్రలు కూడా సరైన రీతిలో దర్శకుడు తీర్చిదిద్దలేదు. హీరో, హీరోయిన్లు, ఇతర పాత్రలు మాట్లాడే తెలంగాణ యాస సహజంగా అనిపించదు. 'కోర్ట్' ద్వారా రోషన్, శ్రీదేవిల జంటకు వచ్చిన క్రేజ్‌తో ఇమ్మీడియట్ మరో సినిమా తీసేయాలనే హడావుడే తప్ప, ఓ మంచి సినిమాను ప్రేక్షకులకు అందించాలనే ఉద్దేశం మేకర్స్‌లో ఉన్నట్లుగా కనిపించలేదు. 'కోర్ట్' సినిమాలో టీనేజ్ జంటగా అలరించిన ఈ జంట పాత్రలు ఈ సినిమాలో సరైన రీతిలో తీర్చిదిద్దకపోవడంతో రెండూ పాత్రలు ఆకట్టుకునేల లేవు. గిరిగా హర్ష్ రోషన్ నటన పరిధి మించిన విధంగా కనిపిస్తుంది. చాలా చోట్ల ఆయన డైలాగ్ డెలివరీ, నటన, హావాభావాలు శ్రుతి మించినట్లుగా అనిపిస్తుంటాయి. శ్రీదేవి పాత్ర కూడా అంతగా ఆకట్టుకోదు. కథ, కథనంలో బలం లేకపోవడంతో ఏ పాత్ర కూడా అలరించే విధంగా లేదు. విజయ్ బుల్గానిస్ సంగీతం ఆయన మార్క్‌లో లేదు, రచయితగా ఎన్నో విజయవంతమైన చిత్రాలకు కథను అందించిన కోన వెంకట్ ఇలాంటి నాసిరకం కథతో, నీరసమైన సన్నివేశాలతో ఇలాంటి సినమా తీయడం అందరిని ఆశ్చర్యపరుస్తుంది. దర్శకుడు సతీష్ జవ్వాజి ఏ విషయంలో కూడా తన ప్రతిభను చూపలేకపోయాడు. సినిమాలో కొత్తదనం కోసం రచన బృందం కనీసం ప్రయత్నించినట్లుగా అనిపించదు.

PUBLISHED BY G.KALPANA AND PRINTED AT YAGNA PRINTERS AND PUBLICATIONS, H.NO 18-105/4, OPP HANUMANPET, MALKAJGIRI(M)MEDCHAL- 500047, MEDCHAL MALKAJGIRI DISTRICT,TELANGANA PUBLISHED FROM H.NO02-66/254,MALLAREDDY NAGAR PHASE 1, GAJULARAMARAM, QUTHBULLAPUR, MEDCHAL-500055, DISTRICT MALKAJGIRI ,TELANGANA, EDITOR : G.DAYAKAR REDDY , RNI :TELTEL/2022/83927, PHONE NUMBER 9908293393,040- 45046154